

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | మంగళవారం 24-06-2025 | సంపుటి - 24 | సంచిక - 53 | రూ : 4 | పేజీలు: 8




## అమెరికా అడ్డా..
# పశ్చిమాసియా

- గల్ఫ్ దేశాల్లో భారీగా సైనిక స్థావరాలు
- లక్ష్యంగా చేసుకుంటున్న ఇరాన్
- ప్రపంచ వ్యాప్తంగా 80 దేశాల్లో 750 అమెరికా స్థావరాలు

అగ్రరాజ్యం అమెరికా.. ప్రపంచంలో ఏ ఘర్షణ జరిగినా నేనున్నానంటూ జోక్యం చేసుకుంటుంది. శాంతి చర్చల పేరుతోనో.. మిత్రులకు సాయం పేరుతోనో రంగంలోకి దిగుతుంది. అలాంటి అగ్ర రాజ్యానికి ప్రపంచ వ్యాప్తంగా సైనిక స్థావరాలున్నాయి. అమెరికన్ యూనివర్సిటీ పొలిటికల్ ఆంత్రోపాలజీ ప్రొఫెసర్ డేవిడ్ వైన్ తెలిపిన వివరాల ప్రకారం.. 2021 నాటికే అమెరికాకు 80 దేశాల్లో 750 సైనిక స్థావరాలున్నాయి. ఆ దేశానికి జపాన్‌లో

తరువాయి 2లో

## బనకచర్లపై..
# ఎందాకైనా కొట్లాడతాం

- తెలంగాణ వాటా జలాల్లో ఒక్క చుక్క కూడా వదులుకోం
- ఈ నెల 30లోగా కాళేశ్వరం కమిషన్‌కు పూర్తి ఆధారాలు
- నవంబరు 9లోగా అన్ని కలెక్టరేట్లలో తెలంగాణ తల్లి విగ్రహాలు
- చౌటుప్పల్-సంగారెడ్డి వరకు ఆర్ఆర్ఆర్ దక్షిణ భాగం ఎలైన్‌మెంట్‌కు ఆమోదం
- ప్రభుత్వ సలహాదారుగా డాక్టర్ నోరి దత్తాత్రేయుడు
- రాష్ట్ర మంత్రివర్గం కీలక నిర్ణయాలు

హైదరాబాద్: ఏపీ తలపెట్టిన బనకచర్ల ప్రాజెక్టు నిర్మాణాన్ని అడ్డుకునేందుకు ఎంతవరకైనా పోరాడాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించింది. గోదావరిలో తెలంగాణ వాటా జలాల్లో ఒక్క చుక్క కూడా వదులుకునేది లేదని స్పష్టం చేసింది. గోదావరి బనకచర్లపై ఇప్పటివరకు జరిగిన పరిణామాలు, భవిష్యత్తు కార్యాచరణకు సంబంధించి జులై మొదటి వారంలో సీఎల్పీ సమావేశం ఏర్పాటు చేసి.. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎంపీలకు

తరువాయి 2లో





## భారాస హయాంలో
# నిధులివ్వకుండానే పనులు

- అప్పటి పెండింగ్ పనుల విలువ రూ.1.75 లక్షల కోట్లు
- వీటన్నింటినీ మంత్రివర్గ ఉపసంఘం పరిశీలిస్తుంది
- ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క

హైదరాబాద్: బడ్జెట్ వినియోగంలో పారదర్శకత తీసుకురావడంతోపాటు కేటాయింపులకు తగ్గట్లుగా నిధులను ఖర్చు చేసేలా... అన్ని శాఖల్లో అవసరమైన మార్పులు తీసుకొస్తున్నట్లు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క వెల్లడించారు. భారాస హయాంలో కేటాయింపులతో సంబంధం లేకుండా భారీగా పనులు మంజూరు చేయడం, వాటిని ఏళ్ల తరబడి సాగదీయడం, కొన్నింటిని కాగితాల్లో తప్ప ప్రారంభించకపోవడం, మరికొన్ని శాఖల్లో కేటాయింపులకు మించి ఖర్చు చేయడం, ఇంకొన్నింట్లో అసలు ఖర్చే చేయకపోవడం వంటి కారణాలతో రాష్ట్రంలో

తరువాయి 2లో



# 9 రోజుల్లోపే రైతు భరోసా

- ఇప్పటివరకు 67 లక్షల మందికి రూ.8,284 కోట్ల విడుదల
- మిగిలినవారికి నేడు జమ
- హైదరాబాద్‌లో నేడు విజయోత్సవ సభ
- రాష్ట్రవ్యాప్తంగా రైతు పండగ

హైదరాబాద్: వానాకాలం సీజన్‌లో పంటలకు పెట్టుబడి సాయం పంపిణీ 9 రోజుల్లోపే పూర్తి కానుంది. రైతు భరోసా పథకం కింద 15 ఎకరాల వరకు ప్రభుత్వం సోమవారం రూ.513.13 కోట్ల నిధులు విడుదల చేసింది. దీంతో ఏడు రోజుల్లో 67.01 లక్షల మంది రైతుల ఖాతాల్లోకి రూ.8,284.66 కోట్లు జమ అయ్యాయి.సాగులో ఉన్న మిగతా భూములకూ మంగళవారం నిధులు జమ చేయనుంది. ఈ నెల 16న ఆచార్య జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో జరిగిన రైతు నేస్తం కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రైతుభరోసా సాయం విడుదలను ప్రారంభించారు. మొదటి రోజు రెండెకరాల వరకు, రెండో రోజు మూడెకరాల వరకు, మూడో రోజు నాలుగెకరాల వరకు, నాలుగో రోజు ఐదెకరాల వరకు, ఐదో రోజు 67 ఎకరాల వరకు, ఆరో రోజు(శనివారం) 89 ఎకరాల వరకు, సోమవారం ఏడో రోజు 1015 ఎకరాల వరకు నిధులను విడుదల చేశారు. తొలి రోజు రూ.2,349.83 కోట్లు ఇవ్వగా.. రెండో రోజు రూ.3,901.73 కోట్లకు, మూడో రోజు రూ.5,215.26 కోట్లకు,

తరువాయి 2లో



# వేళ్లన్నీ ప్రభాకర్‌రావు వైపే..!

- తమను తప్పుదోవ పట్టించారంటున్న ఆయన పైఅధికారులు
- నాటి హోంశాఖ ముఖ్య కార్యదర్శి, నిఘా విభాగాధిపతి వాంగ్మూలం నమోదు?
- త్వరలో మాజీ సీఎస్ శాంతికుమారిది కూడా..
- 15 రోజుల్లో 4 వేలకుపైగా ఫోన్లు ట్యాప్ చేసినట్లు సిట్ గుర్తింపు
- నేడు ఎంపీ ఈటల, ఇతర నాయకుల వాంగ్మూలం

హైదరాబాద్: ఎస్ఐబీ మాజీ ఓఎస్డీ ప్రభాకర్‌రావు అమెరికా నుంచి తిరిగి రావడంతో ఫోన్ అక్రమ ట్యాపింగ్ కేసు ఓ కొలిక్కి వస్తుందని అంతా భావించారు. కానీ, ఆయన విచారణలో మరిన్ని విస్తుపోయే విషయాలు బయటపడుతూ కేసు రోజుకో మలుపు తిరుగుతోంది. ప్రభాకర్‌రావు తమను తప్పుదోవ పట్టించినట్లు ఆయన పైఅధికారులు, రివ్యూ కమిటీ సభ్యులు వెల్లడించినట్లు తెలుస్తోంది. దీంతో ఈ కేసులో వీరి వాంగ్మూలాలు కీలకంగా మారనున్నాయి. రివ్యూ కమిటీకి నేతృత్వం వహించిన

తరువాయి 2లో

# బీసీ రిజర్వేషన్లపై చిత్తశుద్ధితో ఉన్నాం

- ప్రధాని అపాయింట్‌మెంట్ తీసుకోవాలని ఆర్.కృష్ణయ్యకు సూచన
- కవితకు బీసీల గురించి మాట్లాడే అర్హత లేదని విమర్శ

2లో



# ఏడాదిలో రెవెన్యూ ప్రక్షాళన

- ట్యాంపరింగ్‌కు వీల్లేని సాంకేతికతతో రికార్డులను సరిచేస్తాం
- ఈ సంవత్సరమే అనకాపల్లి వరకు గోదావరి నీళ్లు
- పోలవరం- బనకచర్ల అనుసంధానంతో ఎవరికీ నష్టం లేదు
- ఏపీ, తెలంగాణ చెరో 200 టీఎంసీలు వాడుకున్నా ఇబ్బంది లేదు
- ఏడాది కాలంలో అద్భుతంగా పనిచేశాం
- వచ్చే సంవత్సరానికి 15% వృద్ధి రేటే లక్ష్యం
- ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడి
- ఏడాది పాలన పూర్తయిన వేళ 'సుపరిపాలనలో తొలి అడుగు' పేరుతో ప్రత్యేక కార్యక్రమం

2లో

# వేళ్లన్నీ ప్రభాకర్‌రావు వైపే..!

(మొదటిపేజీ తరువాయి)

అప్పటి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి వాంగ్మూలం కూడా నమోదు చేయనుండటం ప్రాధాన్యం సంతరించుకుంది. మరోపక్క 2018 శాసనసభ ఎన్నికల్లోనూ ట్యాపింగ్ జరిగిందని సిట్ గుర్తించినట్లు సమాచారం. ఈ వ్యవహారంలో బాధితుల వాంగ్మూలం నమోదు ప్రక్రియ చురుగ్గా సాగుతోంది. భాజపా ఎంపీ ఈటల రాజేందర్‌పాటు పలువురు నాయకులు మంగళవారం సిట్ ఎదుట హాజరై వాంగ్మూలం ఇవ్వనున్నారు.

**కావల్సిన నంబర్లు చేర్చి.. ఏమార్చారు..**

ఈ కేసులో ప్రధాన నిందితుడు ప్రభాకర్‌రావును ప్రశ్నిస్తున్న సిట్ అధికారులు.. ఫోన్ ట్యాపింగ్ సమయంలో వివిధ హోదాల్లో పనిచేసిన అధికారుల వాంగ్మూలాల సేకరణ కూడా చేపడుతున్నారు. అప్పట్లో హోంశాఖ ముఖ్య కార్యదర్శిగా పనిచేసిన ప్రస్తుత డీజీపీ జితేందర్, నిఘా విభాగాధిపతిగా పనిచేసిన అనిల్‌కుమార్‌ల నుంచి రాతపూర్వక వాంగ్మూలం తీసుకున్నట్లు తెలుస్తోంది. ట్యాపింగ్ చేయాల్సిన నంబర్లకు హోంశాఖ ముఖ్యకార్యదర్శి అనుమతిస్తే.. నిఘా విభాగాధిపతి వాటిని పరిశీలించాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలోనే వారిద్దరి వాంగ్మూలం సేకరించినట్లు చెబుతున్నారు. ప్రభాకర్‌రావు తమను తప్పుదోవ పట్టించినట్లు వారు పేర్కొన్నట్లు తెలుస్తోంది. మావోయిస్టులు, వారికి సంబంధించిన వారి నంబర్ల ముసుగులో ఇతర నంబర్లు కూడా చేర్చారని, తాము గుర్తించలేకపోయామని చెప్పినట్లు సమాచారం. ట్యాపింగ్ చేసిన నంబర్లను పునఃపరిశీలించాల్సిన రివ్యూ కమిటీ నుంచి కూడా సిట్ అధికారులు వాంగ్మూలం తీసుకుంటున్నారు. సీఎస్ ఆధ్వర్యంలో పనిచేసే ఈ కమిటీలో న్యాయశాఖ, సాధారణ పరిపాలన శాఖల కార్యదర్శులు సభ్యులుగా ఉంటారు. అప్పటి సీఎస్ శాంతికుమారి విదేశీ పర్యటన కారణంగా ఆమె వాంగ్మూలం ఇంకా నమోదు చేయలేదని, మిగతా ఇద్దరూ ఇప్పటికే ఇచ్చారని తెలుస్తోంది. వీరు కూడా ప్రభాకర్‌రావు తమను ఏమార్చారని, పెద్దసంఖ్యలో నంబర్లు ఉండటం వల్ల క్షుణ్నంగా పరిశీలించలేకపోయామని చెప్పినట్లు వినికిడి. ఇప్పటికే ప్రణీత్‌రావు తదితర నిందితులు కూడా ప్రభాకర్‌రావు చెప్పినట్లే చేశామని చెప్పారు. దీంతో వేళ్లన్నీ ఆయన వైపే చూపిస్తున్నాయి.

**అప్పటి డీజీపీనే అడగండి..**

2020 అక్టోబరులో అప్పటి నిఘా విభాగాధిపతి నవీన్‌చంద్ ఉద్యోగ విరమణ పొందగా.. అంతకు ముందే ప్రభాకర్‌రావు కూడా పొందారు. అయినప్పటికీ ప్రభాకర్‌రావును ఓఎస్డీ హోదాలో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం నిఘా విభాగాధిపతిగా నియమించింది. ఉద్యోగ విరమణ చేసిన అధికారిని అత్యంత కీలకమైన పదవిలో నియమించడంపై అప్పట్లోనే చర్చ జరిగింది. దీనిపై సిట్ అధికారులు ప్రభాకర్‌రావును ప్రశ్నించినప్పుడు.. అప్పటి డీజీపీ మహేందర్‌రెడ్డినే అడగండని చెప్పినట్లు సమాచారం. దీంతో మహేందర్‌రెడ్డితోపాటు నవీన్‌చంద్ నుంచి కూడా వాంగ్మూలం తీసుకోవాలని అధికారులు భావిస్తున్నట్లు తెలుస్తోంది.

**2018 ఎన్నికల నుంచేనా..?**

ప్రభాకర్‌రావు ఆధ్వర్యంలో కేవలం 15 రోజుల వ్యవధిలోనే 4 వేల పైచిలుకు ఫోన్ నంబర్లు ట్యాప్ చేసినట్లు సిట్ అధికారులు గుర్తించినట్లు సమాచారం. 2023 నవంబరు 15 నుంచి 30 మధ్య జరిగిన ఈ వ్యవహారంలో రాజకీయ నాయకులకు సంబంధించి 618 ఫోన్లు ఉన్నట్లు తేలింది. మరోవైపు మునుగోడు ఉపఎన్నిక నుంచి 2023 అసెంబ్లీ ఎన్నికల వరకు ఫోన్ల ట్యాపింగ్ జరిగినట్లు ఇప్పటి వరకు భావిస్తుండగా.. అంతకు ముందు 2018 ఎన్నికల నుంచే ఈ తంతు సాగించినట్లు సిట్ అధికారులు తాజాగా అనుమానిస్తున్నారు. దీనిపై మరింత లోతుగా దర్యాప్తు చేయాలని నిర్ణయించారు.

# అమెరికా అడ్డా.. పశ్చిమాసియా

(మొదటిపేజీ తరువాయి)

120, జర్మనీలో 119, దక్షిణ కొరియాలో 73 స్థావరాలున్నాయి. పశ్చిమాసియాలోనూ ఆ దేశం అనేక సైనిక స్థావరాలను నెలకొల్పింది. ఇజ్రాయెల్, ఇరాన్ యుద్ధంలో అమెరికా జోక్యం చేసుకుని అణు కేంద్రాలపై బాంబులు కురిపించింది. ఈ నేపథ్యంలో పశ్చిమాసియాలోని అమెరికా స్థావరాలను ఇరాన్ లక్ష్యంగా చేసుకుంటోంది. ఇప్పటికే ఖతార్, ఇరాక్‌లలోని స్థావరాలపై సోమవారం రాత్రి దాడులకు దిగింది. ఈ నేపథ్యంలో అమెరికాకు ఈ ప్రాంతంలో స్థావరాలు ఎక్కడెక్కడ ఉన్నాయనేది ఆసక్తికరంగా మారింది. 2025 జూన్ నాటికి పశ్చిమాసియాలో 40,000 మంది అమెరికా సైనికులున్నారు. అందులో చాలావరకు సముద్రాల్లోని యుద్ధ నౌకల్లో, మిగిలిన వారు 19 స్థావరాల్లో ఉన్నారు. బ్రెయిన్, ఈజిప్టు, ఇరాక్, ఇజ్రాయెల్, జోర్డాన్, కువైట్, ఖతార్, సౌదీ అరేబియా, సిరియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లలో (యూఏఈ) అమెరికా స్థావరాలున్నాయి. ఇందులో 8 స్థావరాలు శాశ్వతంగా ఏర్పరుచుకున్నవి. పశ్చిమాసియాలో తొలిసారిగా 1958 జులైలో అమెరికా స్థావరాన్ని ఏర్పాటు చేసింది. లెబనాన్ సంక్షోభం సమయంలో బీరుట్‌కు సైన్యాన్ని అమెరికా పంపింది.

**పశ్చిమాసియాలో కీలకమివే..**

ఖతార్ రాజధాని దోహా శివార్లలోని ఎడారిలో 24 హెక్టార్ల విస్తీర్ణంలో అల్ ఉదీద్ సైనిక స్థావరం ఉంది. ఇది అమెరికా సెంట్రల్ కమాండ్ ప్రధాన కార్యాలయంగా ఉంది. పశ్చిమాసియాలో అతి పెద్ద వైమానిక స్థావరమైన ఇక్కడ 10,000 మంది సైనికులుంటారు. పశ్చిమాన ఉన్న ఈజిప్టు నుంచి తూర్పున కజికిస్థాన్ వరకూ కార్యకలాపాలను చూసుకుంటుంది. ఇరాక్‌లోని పశ్చిమ అంబర్ ప్రావిన్సులో అల్ అసద్ వైమానిక స్థావరం ఉంది. ఇరాకీ బలగాలతోపాటు నాటో మిషన్‌కు ఇది సాయం అందిస్తుంది. దీనిపై 2020లో ఇరాన్ దాడి చేసింది. పాక్షిక స్వయంప్రతిపత్తి కలిగిన కుర్దిస్థాన్ ప్రాంతంలో అమెరికాకు ఎర్బిల్ వైమానిక స్థావరం ఉంది. ఇది అమెరికాతోపాటు సంకీర్ణ బలగాలకు సేవలందిస్తుంది. యుద్ధ కార్యకలాపాలపై శిక్షణనిస్తుంది. బ్రెయిన్‌లోని అమెరికా స్థావరంలో 8,300 మంది సైనికులున్నారు. ఇది 5వ ఫ్లీట్‌కు ప్రధాన కార్యాలయంగా ఉంది. అమెరికా నౌకాదళ కార్యకలాపాలకు ఈ స్థావరం కీలకం. గల్ఫ్, ఎర్ర సముద్రం, అరేబియన్ సముద్రంతోపాటు హిందూ మహా సముద్రంలోని కొంత భాగాన్ని ఇది పర్యవేక్షిస్తుంది. కువైట్‌లో అరిఫ్‌జాన్, అలీ అల్ సలేంలలో అమెరికా స్థావరాలున్నాయి. అరిఫ్‌జాన్.. అమెరికా సెంట్రల్ సైన్యానికి ప్రధాన కేంద్రం. అలీ అల్ సలేం వైమానిక స్థావరం ఇరాక్ సరిహద్దుకు 40 కిలోమీటర్ల దూరంలోనే ఉంటుంది. వీటితోపాటు 2003లో ఇరాక్ యుద్ధ సమయంలో క్యాంప్ బుహ్‌రింగ్‌ను అమెరికా ఏర్పాటు చేసింది. ఆ తర్వాత ఇది ఇరాక్, సిరియాల్లో సేవలందిస్తోంది.

# బీసీ రిజర్వేషన్లపై చిత్తశుద్ధితో ఉన్నాం: మంత్రి పొన్నం



బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని మంత్రి పొన్నం ప్రభాకర్ పునరుద్ఘాటించారు. బీసీలకు మద్దతు గురించి ఎమ్మెల్సీ కవితతో బీసీ నేత, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య మాట్లాడటం సమంజసం కాదన్నారు. ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, కార్పొరేషన్ల ఛైర్మన్లు నూతి శ్రీకాంత్‌గౌడ్, మెట్టు సాయికుమార్ తదితరులతో కలిసి మంత్రి సోమవారం గాంధీభవన్‌లో మాట్లాడారు. 'రాహుల్‌గాంధీ పార్లమెంట్ సాక్షిగా బీసీ విజన్ గురించి బల్లగుద్ది చెబుతున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ సహా క్యాబినెట్ మొత్తం స్పష్టమైన వైఖరితో ఉన్నాం. మాజీ సీఎం కేసీఆర్ లేదా ఆయన పక్కన ఉండేవారు ఎవరైనా సరే బీసీల కోసం మాతో కలిసి రండి. తెలంగాణలో 56 శాతం బీసీలు ఉన్నారన్నది వాస్తవం. భారాస అధికారంలో ఉన్నప్పుడు కవిత బలహీనవర్గాల గురించి మాట్లాడి ఉంటే బాగుండేది. ఇప్పుడు ఆమెను ఎవరూ విశ్వసించరు. ఆర్.కృష్ణయ్య అంటే అపారమైన గౌరవం ఉంది. భారాస నేతలతో కలిసి బీసీల గురించి మాట్లాడి ఆయన స్థాయిని తగ్గించుకోవద్దు. తమ్ముడిగా కోరుతున్నా.. ప్రధాని మోదీ అపాయింట్‌మెంట్ తీసుకోండి. బీసీ రిజర్వేషన్లపై రాజకీయాలకు అతీతంగా అందరం వెళ్లి కలుద్దాం' అని పొన్నం పేర్కొన్నారు.

# బనకచర్లపై ఎందాకైనా కొట్లాడతాం

(మొదటిపేజీ తరువాయి)

పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇవ్వాలని నిర్ణయించింది. రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన సోమవారం సుమారు 5 గంటలకు పైగా జరిగిన మంత్రివర్గ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. సమావేశం వివరాలను మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి విలేకరులకు వెల్లడించారు.

* **భారాస హయాంలోనే బనకచర్లకు పునాది**

"గోదావరి బేసిన్ జలాల్లో 400 టీఎంసీలను కృష్ణాలోకి మళ్లించడాన్ని 2016లోనే ఎపెక్స్ కమిటీలో గత భారాస ప్రభుత్వం అంగీకరించింది. ఆ బనకచర్ల బంకను మా ప్రభుత్వంపై రుద్దేందుకు భారాస చేస్తున్న గోబెల్స్ ప్రచారంపై సమావేశంలో వివరంగా చర్చించాం. గోదావరిలోని తెలంగాణ వాటా జలాల్లో ఒక్క చుక్క కూడా పోకుండా.. చట్టపరంగా, న్యాయపరంగా ఎంత దూరమైనా పట్టుదలగా పోరాడాలని తీర్మానించాం. గత భారాస పాలనలోనే బనకచర్లకు పునాది పడింది. దాన్ని కప్పిపుచ్చుకోవడం కోసం మసిపూసి మారేడుకాయ చేయడానికి.. ఆనాటి సీఎం, ఆనాటి మంత్రులు తహతహలాడటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం. ఈ ప్రాజెక్టును అడ్డుకోవాలని ఇప్పటికే కేంద్ర జలవనరుల శాఖ మంత్రిని సీఎం, నీటిపారుదల మంత్రి స్వయంగా కలిసి విజ్ఞప్తి చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించి గత భారాస ప్రభుత్వంలో అప్పటి మంత్రివర్గ సమావేశాల అంశాలన్నీ పూర్తి ఆధారాలతో ఈ నెల 30లోగా విచారణ కమిషన్‌కు అందజేస్తాం. ఆనాటి మంత్రివర్గ ఉప సంఘం ఏ అంశంపై చర్చించింది? ఏం నివేదిక ఇచ్చింది? దాన్ని ఆనాటి మంత్రివర్గం ఆమోదిస్తే.. ఆ పనులు చేశారా? లేదా? అనే పూర్తి వివరాలను కమిషన్‌కు ఇవ్వాలని నిర్ణయించాం. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆధ్వర్యంలో సీనియర్ అధికారులకు ఈ బాధ్యతను అప్పగించాం.

**ఒలింపిక్స్‌కు సన్నద్ధం చేసేలా..**

2036 ఒలింపిక్స్‌కు సన్నద్ధం చేసేందుకు రాష్ట్రంలో ప్రతిభ ఉన్న క్రీడాకారులను ప్రోత్సహించేలా, క్రీడా ప్రమాణాలను పెంపొందించేలా రూపొందించిన తెలంగాణ స్పోర్ట్స్ పాలసీని క్యాబినెట్ ఆమోదించింది. ఇందులో భాగంగా తెలంగాణ స్పోర్ట్స్ హబ్ బోర్డు ఆఫ్ గవర్నెన్స్‌ను, తెలంగాణ క్రీడా అభివృద్ధి నిధిని ఏర్పాటు చేస్తారు. జిల్లాల్లో క్రీడల అభివృద్ధికి ఏటా జిల్లా కలెక్టర్ల ఆధ్వర్యంలో ఉండే ఫ్రూషియల్ బ్యాలెన్స్ ఫండ్‌లో పది శాతం కేటాయిస్తారు. స్పోర్ట్స్ కోటా రిజర్వేషన్లకు అర్హత జాబితాలో సీఎం కప్ రాష్ట్రస్థాయి విజేతలకు అవకాశం కల్పించాలని మంత్రివర్గం నిర్ణయించింది.

**71 లక్షల మంది రైతన్నలకు భరోసా**

ఈ ఏడాది వానాకాలం పంటలకు పెట్టుబడి సాయంగా రైతు భరోసాను రాష్ట్ర ప్రభుత్వం విజయవంతంగా రికార్డు వేగంతో అందించింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రైతునేస్తం కార్యక్రమంలో ఇచ్చిన మాట ప్రకారం 9 రోజుల్లో రూ.9 వేల కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేసింది. 1.49 కోట్ల ఎకరాలకు ఈ సాయాన్ని పంపిణీ చేసింది. ఇంత తక్కువ వ్యవధిలో దాదాపు 71 లక్షల మంది రైతులకు భరోసా సాయం అందించిన ఘనత మా ప్రభుత్వానిదే. ఈ శుభ సందర్భాన్ని రైతుల సమక్షంలోనే ఉత్సవంగా జరుపుకోవాలని క్యాబినెట్ నిర్ణయించింది. మంగళవారం సాయంత్రం 4 గంటలకు సచివాలయం ఎదురుగా రాజీవ్‌గాంధీ విగ్రహం వద్ద 2 వేల మంది రైతులతో 'రైతు నేస్తం' కార్యక్రమం నిర్వహించనున్నాం. అన్ని జిల్లాల్లో రైతు వేదికలతో పాటు మండల కేంద్రాల్లో పెద్దఎత్తున ర్యాలీలు, సంబరాలు నిర్వహించాలని క్యాబినెట్ పిలుపునిచ్చింది. ఈ సంబరాల్లో మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు పాల్గొనాలని నిర్ణయం తీసుకుంది.

* **తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్ రూపకల్పన**

తెలంగాణ రైజింగ్ 2047 విజన్ పాలసీ డాక్యుమెంట్ రూపొందించేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. డిసెంబరు 9న తెలంగాణ తల్లి విగ్రహ అవతరణ దినోత్సవం సందర్భంగా ఈ డాక్యుమెంట్‌ను ఆవిష్కరించాలని నిర్ణయించాం. దీని రూపకల్పన, ప్రణాళికల తయారీకి వివిధ రంగాల్లో జాతీయ, అంతర్జాతీయ స్థాయి ప్రముఖులు, నిపుణులతో సలహా కమిటీ ఏర్పాటు చేయాలని మంత్రివర్గం నిర్ణయించింది. 2035 నాటికి రాష్ట్రం ట్రిలియన్ డాలర్ ఆర్థిక వ్యవస్థగా వృద్ధి సాధించాలనేది లక్ష్యం. కేంద్రం ప్రకటించిన వికసిత్ భారత్ లక్ష్యాలకు అనుగుణంగా రాష్ట్రంలో మౌలిక సదుపాయాల వృద్ధితో పాటు మహిళలు, రైతులు, యువకుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని క్యాబినెట్ నిర్ణయించింది" అని మంత్రులు వివరించారు.

# 9 రోజుల్లోపే రైతు భరోసా

(మొదటిపేజీ తరువాయి)

నాలుగో రోజు రూ.6,404.70 కోట్లకు, ఐదో రోజు రూ.7,310.59 కోట్లకు, ఆరో రోజు రూ.7,770.83 కోట్లకు, ఏడో రోజు రూ.8,284.66 కోట్లకు చేరుకున్నాయి.

**విజయోత్సవ సభ.. రైతు పండగ**

రైతుభరోసా నిధుల విడుదల పూర్తవుతున్న సందర్భంగా మంగళవారం సచివాలయం ఎదురుగా ఉన్న రాజీవ్ గాంధీ విగ్రహం వద్ద రైతు విజయోత్సవ సభ నిర్వహించనున్నారు. సాయంత్రం ఆరు గంటలకు రైతులను ఉద్దేశించి సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగిస్తారు. ఉప ముఖ్యమంత్రి భట్టి, వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో పాటు ఇతర మంత్రులు, కొందరు రైతు భరోసా లబ్ధిదారులు పాల్గొననున్నారు. దీంతో పాటు రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో, మండలాల్లో, గ్రామాల్లో రైతు పండగ నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించింది. ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొనాలని సూచించింది.

# ఏడాదిలో రెవెన్యూ ప్రక్షాళన



అమరావతి: రాష్ట్రంలో ప్రస్తుతం 70 80 శాతం ఫిర్యాదులు రెవెన్యూ శాఖకు సంబంధించే వస్తున్నాయని, రాబోయే ఏడాది కాలం అధికారులు అంకితభావంతో పనిచేసి రెవెన్యూ రికార్డుల్ని సరిచేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. వాటిని భవిష్యత్తులో ట్యాంపరింగ్‌కు వీల్లేకుండా బ్లాక్‌చైన్ టెక్నాలజీతో కట్టుదిట్టం చేయాలని దిశానిర్దేశం చేశారు. వెనుకబడిన నియోజకవర్గాలకు వచ్చే పెట్టుబడిదారులకు అదనంగా రాయితీలు, ప్రోత్సాహకాలు కల్పిస్తామని భరోసా ఇచ్చారు. 2027 జూన్ లేదా డిసెంబరు నాటికి పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసి, జాతికి అంకితం చేస్తామని తెలిపారు. పోలవరం ఎడమ ప్రధాన కాలువను ఈ సంవత్సరమే పూర్తి చేసి అనకాపల్లి వరకు నీళ్లిస్తామని ప్రకటించారు. పోలవరం బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టు రాష్ట్రానికి, ముఖ్యంగా రాయలసీమకు గేమ్‌ఛేంజర్ అవుతుందన్నారు. ఆ ప్రాజెక్టు వల్ల తెలంగాణకు ఉపయోగమే తప్ప, నష్టం లేదని పునరుద్ఘాటించారు. 'ఆ ప్రాజెక్టు వల్ల ఎవరికీ ఇబ్బంది లేదు. ఆ నీటిని తెలంగాణ కూడా వాడుకోవచ్చు. గోదావరి జలాల్ని సమానంగా వాడుకునే అవకాశం రెండు రాష్ట్రాలకూ ఉంది. గోదావరి నుంచి ఏటా సగటున 3 వేల టీఎంసీల జలాలు సముద్రంలోకి పోతున్నాయి. వాటిలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణలు ఎంత వాడుకున్నా చెరో 200 టీఎంసీలకు మించదు' అని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏడాది పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా సోమవారం అమరావతిలోని రాష్ట్ర సచివాలయం సమీపంలో 'సుపరిపాలనలో తొలి అడుగు' పేరుతో మూడు పార్టీల నేతలు, అధికారులతో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన సుమారు గంటా నలభై నిమిషాలపాటు ప్రత్యేక ప్రజంటేషన్ ఇచ్చారు. ఏడాది కాలంలో ప్రభుత్వం సాధించిన విజయాలు, 202526 సంవత్సరానికి లక్ష్యాలు, స్వర్ణాంధ్ర విజన్2047 సాధనకు కార్యాచరణను వివరించారు. మొదటి సంవత్సరం అద్భుతంగా పనిచేశామని, వచ్చే సంవత్సరం ఎట్టి పరిస్థితుల్లో 15 శాతం వృద్ధి రేటు సాధించి.. 2047కు స్వర్ణాంధ్ర విజన్ ఆచరణ సాధ్యమేనని నిరూపిద్దామని పిలుపునిచ్చారు.

**ఏడాదిలో రికవరీ ఫేజ్‌కు వచ్చాం**

'ఐదేళ్ల వైకాపా పాలనలో అన్ని వ్యవస్థలూ అస్తవ్యస్తమై, కేంద్ర సహకారం లేకపోతే ఊపిరి పీల్చుకోలేని పరిస్థితుల్లో పాలనా పగ్గాలు చేపట్టాం. రాష్ట్రాన్ని విధ్వంసం నుంచి కాపాడి, పునర్నిర్మాణం వైపు తీసుకెళతామని హామీ ఇచ్చాం. ఈ ఏడాది కాలంలో అన్నీ చేసేశామని చెప్పడం లేదు గానీ, ఊహించినదానికన్నా ఎక్కువే చేశాం. ఒక సంవత్సరంలో రికవరీ ఫేజ్‌కు వచ్చాం' అని ఆయన పేర్కొన్నారు. 'ఇది చరిత్రాత్మక సమావేశం. ఎమ్మెల్యేలు, ఎంపీల్ని భాగస్వాముల్ని చేస్తూ నియోజకవర్గం, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో స్వర్ణాంధ్ర2047 అమలుకు ప్రత్యేక యంత్రాంగం ఏర్పాటు చేశాం. అందరం నిర్దిష్ట లక్ష్యాలతో వెళదాం. చరిత్ర సృష్టిద్దాం' అని పేర్కొన్నారు.

* **ఐఏఎస్, ఐపీఎస్‌లు.. కుటుంబాలను దత్తత తీసుకోవాలి**

పీ4లో భాగంగా ఐఏఎస్, ఐపీఎస్ అధికారులూ రెండో, మూడో కుటుంబాల్ని దత్తత తీసుకోవాలని చంద్రబాబు సూచించారు. ఆ కుటుంబాల ఆర్థిక పురోభివృద్ధికి వారు ఏ మేరకు దోహదపడ్డారన్న దానిపై ఏటా ప్రోగ్రెస్ రిపోర్టులు ఇస్తామని తెలిపారు. పీ4ను ఉద్యమ స్ఫూర్తితో ముందుకు తీసుకెళ్లాలని, ఆగస్టు 15 నాటికి 15 లక్షల బంగారు కుటుంబాల్ని దత్తత తీసుకోవాలన్న లక్ష్యాన్ని చేరుకోవాలని దిశానిర్దేశం చేశారు.

* **శాంతిభద్రతల విషయంలో కఠినంగా ఉండాలి**

వైకాపా ప్రభుత్వ హయాంలో దేశంలో ఎక్కడ గంజాయి దొరికినా మూలాలు ఆంధ్రప్రదేశ్‌లోనే ఉండేవని చంద్రబాబు పేర్కొన్నారు. ఏడాది కాలంలో గంజాయి పంటను పూర్తిగా నిర్మూలించామన్నారు. 'రాష్ట్రంలో శాంతిభద్రతల విషయంలో కఠినంగా ఉండాలి. ఆడబిడ్డలకు రక్షణ కల్పించి తీరాలి. మూడేళ్ల ఆడబిడ్డలపై లైంగిక వేధింపులకు పాల్పడ్డారన్నది వినడానికే అసహ్యం వేస్తోంది. అలాంటి వాళ్లు మర్యాదగా చెబితే వినరు. వాళ్లు వినేలా ఏం చేయాలో అది చేయాలి' అని పోలీసు అధికారులకు స్పష్టం చేశారు.

* **సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమానికి హాజరైన నాయకులు, ఉన్నతాధికారులు**
* **అమరావతి, విశాఖల్లో గ్లోబల్ మెడికల్ సిటీలు**

రాష్ట్రంలో పెద్ద ఆసుపత్రుల్లేని నియోజకవర్గాల్లో 100 పడకలతో పీపీపీ విధానంలో ఆసుపత్రులు ఏర్పాటు చేస్తామని చంద్రబాబు తెలిపారు. 'ప్రజారోగ్యంపై ఎక్కువ శ్రద్ధ పెడతాం. అమరావతి, విశాఖల్లో గ్లోబల్ మెడికల్ సిటీలు ఏర్పాటు చేస్తాం. బిల్ మెలిండా గేట్స్ ఫౌండేషన్ రాష్ట్రంలో డిజిటల్ హెల్త్ రికార్డుల రూపకల్పన, గ్లోబల్ నాలెడ్జ్, టెక్నాలజీని అందించేందుకు ముందుకొచ్చింది. కుప్పంను నమూనాగా తయారు చేశాం. చిత్తూరు జిల్లాలో ఆరు నెలల్లో పూర్తి చేస్తాం. వ్యాధి నివారణలో యోగా గేమ్ ఛేంజర్ అవుతుంది' అని వివరించారు.

**మూడు లేదా ఐదు స్ట్రాటజిక్ హబ్స్**

రాష్ట్రంలో మూడు లేదా ఐదు స్ట్రాటజిక్ హబ్స్‌ను అభివృద్ధి చేస్తామని చంద్రబాబు తెలిపారు. ఎనిమిది జిల్లాలతో విశాఖను గ్రోత్ ఇంజిన్‌గా చేస్తామని, అమరావతి కేపిటల్ రీజియన్ కింద ఆరేడు జిల్లాల్ని దాని పరిధిలోకి తెస్తామని, రాయలసీమలో 8 జిల్లాలను స్ట్రాటజిక్ హబ్‌గా తీర్చిదిద్దుతామని తెలిపారు. రాయలసీమను లేపాక్షి నుంచి ఓర్వకల్లు వరకు ఫ్యూచర్ టెక్నాలజీ హబ్‌గా చేస్తామన్నారు. డిఫెన్స్, ఏరోస్పేస్, ఎలక్ట్రానిక్స్, ఆటోమొబైల్, డ్రోన్స్, స్పేస్ టెక్నాలజీ, వాటికి అదనంగా గ్రీన్ ఎనర్జీని అభివృద్ధి చేస్తామన్నారు. కోస్తా ప్రాంతంలో బ్లూ ఎకానమీని ప్రోత్సహిస్తామని.. సీవీడ్ నుంచి డీజిల్, రసాయనాల తయారీకి సంబంధించి ఇప్పటికే పైలట్ ప్రాజెక్టులు అమలు చేస్తున్నామని తెలిపారు.

# మర్డర్ కేసును తారుమారు చేసిన ఎస్ఐ పోచయ్య..?

* **తండ్రిని కొట్టి చంపిన కూర్చి పై నుండి పడ్డట్లు కేసు నమోదు**
* **డబ్బులు ఇస్తే సరే ఏ కేసైనా తన చేతుల్లో పని..?**
* **రక్షక భటనిలయంలో పరిరక్షణకు సంకెళ్లు వేసిన ఎస్ఐ...?**

అందోల్ (రేగోడు)ప్రజాస్ఫూర్తి 23: న్యాయ పరిరక్షణకు రక్షకులు అండగా నిలవాల్సింది పోయి రక్షక భక్తుడే న్యాయదేవతకు సంకెళ్లు వేశాడు..? కంచ చేను మేస్తే పంటకేది రక్షణ అన్న చందంగా రేగోడ్ పోలీస్ స్టేషన్లో ఎస్సై పోచయ్యతీరు కొనసాగుతుంది, కన్న తండ్రిని కొట్టి చంపిన కసాయి కొడుకుపై కేసు నమోదు చేయాల్సింది పోయి కుర్చీ మీద కూర్చుని కిందపడి చనిపోయాడని ఫిర్యాదు తీసుకొని లక్షలాది రూపాయల లంచం తీసుకుని..? ప్రజలకు రక్షణగా ఆదర్శంగా నిలవాల్సిన ఎస్సై లంచానికి లాలిచ్చి పడి..? అంతకున్ని వదిలిపెట్టి న్యాయంగా ఫిర్యాదు చేసే కుటుంబీకులను బెదిరించి.. నేరస్తులతో చేతులు కలిపి హత్య కేసును తారుమారు చేశాడని పెద్ద తండా వాసులు, కుటుంబీకులు, బంధువులు కొందరు, ఆరోపించారు. అదే తండకు చెందిన పాలిత్య శంకర్ నాయక్(56) మాలి బాయిలు కలిసి తండాలో నివసం కొనసాగిస్తున్నారు, కాగా ఈనెల 20వ తేదీన తన కొడుకు, వద్ద తండ్రి అయిన శంకర్ నాయక్ కు రావాల్సిన డబ్బులను అడగగా తండ్రిని కొట్టి చంపారన్నారు. శంకర్ నాయక్ చిన్న కూతురుకు పెళ్లి కోసం చేసిన అప్పులను తీర్చేందుకు గతంలో తన కొడుకుకు ఇచ్చిన అప్పును అడగగా తండ్రిని కొట్టి చంపినట్లు తెలిసింది? లంచాలకు ఆశపడి అంతకు న్ని వదిలేసినట్లు పలువురు ఆరోపించారు. శంకర్ నాయక్కు నలుగురు కొడుకులు, నలుగురు బిడ్డలు కాగా నిజాయితీగా ఫిర్యాదు చేసేందుకు వచ్చిన కొడుకులను ఎస్సై బెదిరించినట్లు సమాచారం.ఈ కేసు పక్కదారి పట్టించేందుకు ఉన్నత స్థాయి పోలీస్ అధికారి, రాజకీయ అండదండలతో, పక్కదారి పట్టించే పకడ్బందీ స్కెచ్ వేసినట్టు తెలుస్తుంది. సంబంధిత జిల్లా ఉన్నత అధికారులు స్పందించి పూర్తిస్థాయి విచారణ జరిపి న్యాయాన్ని రక్షించాల్సిన అవసరం ఎంతైనా ఉంది, ఏది ఏమైనా న్యాయ పరిరక్షణ జరగకపోతే కాలమే తీర్పిస్తుంది మరి.

***ఎస్సై పోచయ్య వివరణ:**

పెద్దతండలో శంకర్ నాయక్ హత్య? కేసును తారుమారు చేశారన్న సంఘటనపై ఎస్ఐ పోచయ్యను ఫోన్లో వివరణ కోరగా కుటుంబీకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకే కేసు నమోదు చేశానని పీఎం (పోస్టుమార్టం) నివేదికలు వచ్చాక కేసు పూర్తి దర్యాప్తు కొనసాగుతుందన్నారు. లంచం తీసుకుని కేసును పక్కదారి పట్టించారని అడిగిన ప్రశ్నకు. లంచం తీసుకున్నది మీరే విచారణ జరపాలని ఆశ్చర్యంగా సమాధానం ఇచ్చారు.ఎవరు లంచం తీసుకుంటే వాళ్లే బాధ్యులు అన్నారు. ఈ కేసులో ఎలాంటి స్వయం ఇన్వాల్వ్మెంట్ లేదని తను ఎవరినిబెదిలించలేదని ఫోన్లో అడిగిన వివరణకు సమాధానం ఇచ్చారు.

## పోచమ్మ తల్లి ఆశీస్సులతో ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలి: ఎమ్మెల్యే గూడెం



పటాన్ చేరు,ప్రజాస్ఫూర్తి 23: పోచమ్మ తల్లి ఆశీస్సులతో ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. పటాన్చెరు డివిజన్ పరిధిలోని ముదిరాజ్ బస్తి లో గల పోచమ్మ తల్లి దేవాలయం ఐదవ వార్షికోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్యే జీఎంఆర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే జీఎంఆర్ ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ నియోజకవర్గంలోని దేవాలయాల అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్, సీనియర్ నాయకులు వెంకటరెడ్డి, ఆలయ కమిటీ ప్రతినిధులు, పుర ప్రముఖులు పాల్గొన్నారు.

## వైభవంగా శతపథిష్ఠి యజ్ఞం





శేరిలింగంపల్లి, ( ప్రజాస్ఫూర్తి) : అమెరికా , న్యూజెర్సీ విలింగ్ బోరో లా శ్రీ శ్రీ శ్రీ త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామి వారి మంగళా శాసనములతొ నూతన ఆశ్రమాన్ని ప్రారంభించిన సందర్భంగా సేవా కాలం , తీర్థ గోష్టి అనంతరం శతపథిష్ఠి యజ్ఞం వైభవంగా నిర్వహించారు. చిన్నజీయర్ స్వామిజీ నేతృత్వంలో దివ్యప్రబంధం, భజనలు, విష్ణుసహస్రనామ పారాయణం నిర్వహించారు. 108 దివ్యదేశాలను స్మరించుకుంటూ యజ్ఞం కొనసాగింది. ఈ సందర్భంగా దక్షిణ న్యూజెర్సీలో విశిష్టాద్వైత సంప్రదాయానికి బలమైన స్థాపన ఏర్పడింది. ఈ మహత్తరమైన కార్యక్రమంలో కార్పొరేటర్ మాధవరం రోజా దేవి రంగారావు దంపతులు పాల్గొని వారి ఆశీసులు పోందారు.

## ఆటో డ్రైవర్ల సంక్షేమానికి సంపూర్ణ సహకారం

* **: ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి**
* **శాశ్వత ప్రాతిపదికన ఆటో స్టాండ్**



పటాన్ చెరు(రామచంద్రాపురం) ,ప్రజాస్ఫూర్తి: మియాపూర్ నుండి పటాన్చెరు వరకు గల ఆటో కార్మికుల కోసం లింగంపల్లి చౌరస్తాలో నూతనంగా నిర్మించిన ఫ్లైఓవర్ కింద శాశ్వత ప్రాతిపదికన ఆటో స్టాండ్ ఏర్పాటు చేసేందుకు నిర్ణయించినట్లు పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు.జాతీయ రహదారి 65 విస్తరణలో భాగంగా లింగంపల్లి చౌరస్తాలో నూతనంగా నిర్మించిన ఫ్లైఓవర్ మూలంగా స్థానికంగా ఆటో స్టాండ్ లేకపోవడం మూలంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆటో డ్రైవర్లు ఇటీవల ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డికి తెలిపారు. ఉచిత బస్సు మూలంగా గిరాకీలు తగ్గడంతో పాటు ఆటో స్టాండ్ లేకపోవడంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోయారు.ఈ మేరకు సోమవారం సాయంత్రం పోలీసులు, జాతీయ రహదారుల సంస్థ అధికారులు, ఆటో యూనియన్ సంక్షేమ సంఘం నాయకులతో కలిసి ఆటో స్టాండ్ స్థలం కోసం ఎమ్మెల్యే జీఎంఆర్ బిహెచ్ఇఎల్ చౌరస్తాను పరిశీలించారు. ఎవరికి ఇబ్బందులు తలెత్తకుండా ఫ్లై ఓవర్ కింద మూడు పిల్లర్ల మధ్యన ఆటో స్టాండ్ కోసం స్థలం కేటాయించాలని జాతీయ రహదారుల సంస్థ డి ఈ రామకృష్ణ ఆదేశించారు. సంబంధిత ఉన్నతాధికారులతో చర్చించి వారం రోజుల్లోగా ఆటో స్టాండ్ ఏర్పాటు చేస్తామని ఆయన కార్మికులకు హామీ ఇచ్చారు. ట్రాఫిక్ ఆంక్షలు, ఉల్లంఘనల పేరుతో ఆటో డ్రైవర్లను ఇబ్బంది పెట్టకూడదని, మానవతా దృక్పథంతో వ్యవహరించాలని ట్రాఫిక్ అధికారులకు సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలలోనూ ఆటో డ్రైవర్లకు సముచిత స్థానం కల్పిస్తున్నామని తెలిపారు. భవిష్యత్తులోనూ అండగా ఉంటామని తెలిపారు.ఈ కార్యక్రమంలో నేషనల్ హైవేస్ డిఈ రామకృష్ణ, రామచంద్రాపురం మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్, ట్రాఫిక్ సిఐ విద్యాసాగర్ రెడ్డి, రామచంద్రాపురం సిఐ జగన్నాథ్, నగేష్ యాదవ్, ఆటో డ్రైవర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు గూడెం మధుసూదన్ రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు దస్తగిరి, ఆటో డ్రైవర్లు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.




## స్ఫూర్తినిచ్చిన "సండే బ్రిక్స్ ఛాలెంజ్" – ఐక్యతతో విజయవంతం

* **బ్రిక్స్ ఛాంపియన్ కొరకు పోటా పోటీగా ముందుకొచ్చిన యువత**
* **వారి ఉత్సాహంతో అందరినీ ఛాంపియన్స్ గా గుర్తించిన కలెక్టర్ జితేష్ వి. పాటిల్.**



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: భద్రాద్రికొత్తగూడెంజిల్లాయంత్రాంగం ఆధ్వర్యంలో కొత్తగూడెం ప్రగతి మైదానంలో నిర్వహించిన "సండే బ్రిక్స్ ఛాలెంజ్" విజయవంతంగా సాగింది. యువత, ఉద్యోగులు, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొనడం విశేషంగా నిలిచింది. ఈ సెషన్ ప్రారంభానికి ముందే — పోటీకి అవసరమైన మిషన్లు, మట్టి, ఇసుక, సిమెంట్, నీరు, నీడ, తాగునీటి ఏర్పాట్లతో సహా అన్ని ఏర్పాట్లు సమగ్రంగా పూర్తి చేయబడ్డాయి. పోటీలో పాల్గొనేవారికి అవీ సులభంగా అందేలా ప్లాన్ చేయడమైంది.విద్యాశాఖ ఆధ్వర్యంలో రిజిస్ట్రేషన్ ప్రక్రియ చాలా క్రమబద్ధంగా చేపట్టబడింది. ఫారమ్ నింపడం, సమూహాలుగా విభజించడం మొదలైన ప్రక్రియలు సజావుగా సాగాయి. ఆరుగురు చొప్పున గుంపులు ఏర్పడి, ఏడు మిషన్లపై 168 మంది యువతీ యువకులు పాల్గొన్నారు. ఒక్కో మిషన్ దగ్గర ఒక డిపిఎం ఉద్యోగిని ఇన్చార్జ్గా నియమించి వారిని మార్గ నిర్దేశనం చేస్తూ, సాంకేతిక సహకారం అందించారు.వారు తమ జట్లను ప్రోత్సహిస్తూ, మిశ్రమం తయారీ, బ్రిక్స్ రూపొందించడంలో సహకరించారు. ఇది ప్రతి బృందంలోని సభ్యుల్లో టీం వర్క్, ఐక్యత, ఉత్సాహాన్ని పెంచింది.ఈ కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రతి మిషన్ వద్దకు వెళ్లి స్వయంగా పరిశీలిస్తూ "ఎలా చేస్తున్నారు? ఇంకా మెరుగుగా ఎలా చేయాలో" సూచనలు ఇచ్చారు. ప్రాక్టికల్గా కూడా పాల్గొని, యువతలో మరింత స్ఫూర్తిని నింపారు. దీనికి బెంగుళూరు నుంచి వచ్చిన సిఎస్ఈబి నిపుణులు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించారు.చివరగా పోటీలో పాల్గొన్న వారందరినీ విజేతలుగా ప్రకటిస్తూ — టీ షర్టు, క్యాప్లు కలెక్టర్ అందజేశారు. ఇలాంటి వినూత్నమైన కార్యక్రమం ఏర్పాటు చేయడం పట్ల పాల్గొన్న ప్రతి ఒక్కరు ఆనందాన్ని సంతృప్తిని వ్యక్తం చేశారు.

## యుద్ధ ప్రాతిపదికన సీసీ రోడ్డు పనులను పూర్తి చేయాలి

* **ఆల్విన్ కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్**



శేరిలింగంపల్లి, (ప్రజాస్ఫూర్తి) : యుద్ధ ప్రాతిపదికన సీసీ రోడ్డు పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆల్విన్ కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ అన్నారు. సోమవారం ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని దత్తాత్రేయ కాలనీ లో రూ.18 లక్షల అంచనా వ్యయంతో , పాపమ్మ కాలనీ లో 20 లక్షల అంచనా వ్యయంతో నిర్మాణ పనులు ప్రారంభించనున్న సీసీ రోడ్లను డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ జి.ఎచ్.ఎం.సి ఇంజినీరింగ్ విభాగం అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ సీసీ రోడ్డు నిర్మాణ పనులను నాణ్యత ప్రమాణాల విషయంలో రాజీ పడకుండా త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. రోడ్డును మంచిగా లెవెలింగ్ చేసి వర్షపు నీరు నిలిచిపోవడం వంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలతో నిర్మాణ పనులను పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో యువనేత దొడ్ల రామకృష్ణ గౌడ్, సమ్మారెడ్డి, శివరాజ్ గౌడ్, షౌకత్ అలీ మున్నా, పోశెట్టిగౌడ్, జగదీష్, అశోక్, రామకృష్ణ, ఎ.ఇ శ్రావణి, వర్క్ ఇన్స్పెక్టర్ రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల సమస్యలను పరిష్కరించాలని కాంగ్రెస్ నేతకు వినతి



కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి 23వ డివిజన్ లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డివిజన్ వాసులు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొలన్ శ్రీనివాస్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిసి సమస్యలను వివరించారు. అనంతరం ఆయనను శాలువాతో సత్కరించారు. దీనికి కె ఎస్ ఆర్ సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో గోలి శ్రీనివాస్, మండలపు రమేష్, సతీష్, సాయి తదితరులు పాల్గొన్నారు.

## మున్నూరు కాపు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ప్రధాన కార్యదర్శి గా పోతుల రాజేందర్ నియామకం




మేడ్చల్ ప్రతినిధి, (ప్రజాస్ఫూర్తి) : మున్నూరు కాపు ( పటేల్ ) మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ప్రధాన కార్యదర్శి గా పోతుల రాజేందర్ నియమితులయ్యారు. ఈ మేరకు మున్నూరు కాపు రాష్ట్ర అధ్యక్షులు కొండ దేవయ్య చేతుల మీదుగా సోమవారం నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా రాజేందర్ మాట్లాడుతూ మున్నూరు కాపు సంఘం కోసం నిరంతరం పనిచేస్తామన్నారు. సంఘ అభివృద్ధి కోసం తాను శాయశక్తుల కృషి చేస్తానని పేర్కొన్నారు. నాపై నమ్మకం ఉంచి నాకు పదవి బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర అధ్యక్షులకు, ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.

## బెస్ట్ అవైలబుల్ స్కూల్ లో ప్రవేశించుటకు దరఖాస్తులు ఆహ్వానం

మేడ్చల్ ప్రతినిధి, (ప్రజాస్ఫూర్తి) : 202526 విద్య సంవత్సరానికి గిరిజన బాల బాలికలకు బెస్ట్ అవైలబుల్ స్కూల్ లో ప్రవేశించుటకు దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. మేడ్చల్ మల్కాజిరి జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి మాట్లాడుతూ మేడ్చల్ మల్కాజిరి జిల్లాకు (35) సీట్లు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. అందులో 3వ తరగతులో (17) సీట్లు, 5వ తరగతి లో (9) సీట్లు, 8వ తరగతిలో (9) సీట్లు కేటాయించినట్లు తెలిపారు. గిరిజన తెగలకు చెందిన లంబా డా, ఏరుకుల , ఇతర ఉప కులాలకు చెందిన విద్యార్థిని, విద్యార్థులకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. దరఖాస్తు చేసుకొనుటకు చివరి తేదీ ఈ నెల 27సాయంత్రము 5:00 గంటల వరకు, దరఖాస్తు ఫారములు జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి కార్యాలయము, S30, జిల్లా అధికారుల సమీకృత కార్యాలయము, అంతాయపల్లి గ్రామము, శామీర్ పెట్ మండలము, మేడ్చల్మల్కాజిరి జిల్లా నందు దరఖాస్తు చేసుకొనుటకు ఈ నెల 17 నుంచి 27 వరకు పొడిగించబడుతుందని తెలిపారు. దరఖాస్తు ఉచితముగా పొందగలరు, అట్టి దరఖాస్తుతో పాటు కావలిసిన ధ్రువీకరణ పత్రములు కులము, ఆదాయము, ఆధార్ కార్డు, రేషన్ కార్డు ప్రస్తుతము చదువుచున్న పాఠశాల నుండి పొందిన బోనఫైడ్ సర్టిఫికెట్ ,(02) పాస్ పోర్ట్ సైజు ఫోటోలు (లేటెస్ట్) తో సమర్పించగలరు. అర్హులైన గిరిజన విద్యార్థిని / విద్యార్థులు ఈ అవకాశమును సద్వినియోగము చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకొనుటకు ఈ నెల 17 నుండి 27వరకు పొడిగించినట్లు తెలిపారు. తరువాత అందిన దరఖాస్తులు స్వీకరించబడవు. పూర్తి వివరములకు 9959159629.కు సంప్రదించాలన్నారు.

# రైతు సదస్సు వీక్షించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి

**జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్.**




ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: రైతు భరోసాలో భాగంగా రాష్ట్రంలోని వ్యవసాయ యోగ్యమైన అన్ని భూములకు రైతు భరోసా 9000 కోట్ల రూపాయలు రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసిన సందర్భంగా ప్రభుత్వం సచివాలయం వద్ద నిర్వహించే రైతు సదస్సులో రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి రైతులను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. ఇట్టి కార్యక్రమాన్ని జిల్లాలో ని రైతు వేదికల నుండి రైతులు ప్రత్యక్షంగా వీక్షించే విధంగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా ఉన్న 58 రైతువేదికలలో రైతు సదస్సులు ప్రత్యక్షంగా వీక్షించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. మంగళవారం అన్ని రైతు వేదికలను పండుగ వాతావరణం లో మామిడి తోరణాలు, రంగవల్లులతో అలంకరించాలని అధికారులను ఆదేశించారు. మంగళవారం నాలుగు గంటలకే రైతు వేదిక వద్దకు రైతులు చేరుకునేలా చర్యలు చేపట్టాలని అన్నారు. ఆడియో , వీడియోలో ఎటువంటి సాంకేతిక లోపాలు తలెత్తకుండా సరిచూసుకోవాలన్నారు. రైతు వేదికలకు విచ్చేసే రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. మహిళా రైతులు కూడా పెద్ద ఎత్తున హాజరు అయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమానికి స్థానిక ప్రజాప్రతినిధులకు ఆహ్వానాలు పంపాలని అధికారులకు సూచించారు. ప్రతి రైతు వేదికలో రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ మరియు మండల స్థాయిలో ఎంత మంది రైతులకు ఎంత మొత్తంలో రైతు భరోసా జమ అయినదో వివరాలను అందుబాటులో ఉంచాలన్నారు. ప్రతి రైతు వేదిక వద్ద పెద్ద సంఖ్యలో రైతులు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రైతు వేదికల వద్ద హాజరైన రైతుల వివరాలను నమోదు చేసి నివేదికలు అందించాలని అధికారులను ఆదేశించారు.

## గూడెం ప్రజల కరెంట్ కష్టాలు తీరేది ఎన్నడూ ?

* **జేబీపీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ యెర్రా కామేష్**
* **చెవిలో పూలు,ప్లకార్డులతో వినూత్న నిరసన**



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: నియోజకవర్గంలో అప్రకటిత విద్యుత్తు కోతలను నివారించాలని యెర్రా కామేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.సోమవారం పట్టణంలోని భజన మందిరం ఎదురుగా గల విద్యుత్ డివిజన్ ఇంజనీరు కార్యాలయం ఎదుట పార్టీ శ్రేణులతో కలిసి చెవిలో పూలు, చేతిలో ప్లకార్డులతో నిరసన తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోనే కొత్తగూడెంలో రికార్డు స్థాయిలో ఎండలు మండిపోతున్నాయని చంటి పిల్లలు,ముసలి వారు ఎండలకు ఉక్కపోతలకు బయట ఉండే పరిస్థితులు లేవని ఇంట్లో ఉందామనుకుంటే పగలు,రాత్రి అనే తేడా లేకుండా రోజుకు 20 సార్లకు పైగా అప్రకటిత విద్యుత్తు కోతలు విధిస్తున్నారని గతంలో నియోజకవర్గంలో ఎన్నడూ ఇటువంటి పరిస్థితులు లేవని ఆవేదన వ్యక్తం చేశారు.తక్షణమే విద్యుత్తు అధికారులు,జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకుని విద్యుత్తు కోతలను నివారించాలని లేని యెడల భవిష్యత్ లో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు గంధం మల్లికార్జున రావు, జిల్లా ఉపాధ్యక్షుడు వీరు నాయక్, నియోజకవర్గ అధ్యక్షుడు నాగుల రవి కుమార్,తడికమల్ల దిలీప్,సంజీవ్,బరిగడి అచ్చయ్య,శరత్, దనంజయ్ తదితరులు పాల్గొన్నారు.

## తక్కువ ధరకే బంగారం పేరుతో మోసం.. నిందితుడి అరెస్టు



హైదరాబాద్: తక్కువ ధరకు బంగారం పేరుతో మోసగిస్తున్న నిందితుడిని అఫ్జల్‌గంజ్ పోలీసులు అరెస్టు చేశారు. అంతర్రాష్ట్ర ముఠాకు చెందిన వ్యక్తిగా గుర్తించారు. తక్కువ ధరకు బంగారం విక్రయిస్తామంటూ ముగ్గురు ముఠా సభ్యులు అమాయకులకు టోకరా వేశారు. బాధితుల వద్ద రూ.40 లక్షలు తీసుకొని పరారయ్యారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడు జయ కుమార్‌ను అరెస్టు చేసి.. అతడి వద్ద నుంచి రూ.40 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. మిగతా నిందితులు ఉదయ్, సందీప్ కోసం గాలిస్తున్నారు.

* **డ్రగ్స్ సరఫరా చేస్తున్న ముగ్గురు నిందితులు అరెస్టు**

హైదరాబాద్ నగరంలో డ్రగ్స్ సరఫరా చేస్తున్న నైజీరియన్ సహా ముగ్గురు నిందితులను టీజీన్యాబ్, నార్సింగి పోలీసులు అరెస్టు చేశారు. నిందితుల నుంచి రూ.30 లక్షల విలువ చేసే డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నారు. నిందితులను విక్టర్, రాజేశ్, వీరరాజుగా గుర్తించారు. రాజేశ్ అనే నిందితుడు మే 29న మొయినాబాద్‌లోని అజీజ్‌నగర్‌లో రేవ్‌పార్టీకి డ్రగ్స్ సరఫరా చేసినట్లు తెలుస్తోంది. అంతేకాకుండా మోకిలాలో ఫనిరాజ్ అనే వినియోగదారుడికి 5 గ్రా. కొకైన్ సరఫరా చేసినట్లు పోలీసులకు సమాచారం అందింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## ప్రారంభమైన రాష్ట్ర మంత్రివర్గ సమావేశం.. పలు అంశాలపై చర్చ

హైదరాబాద్: సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన తెలంగాణ మంత్రి వర్గ సమావేశం ప్రారంభమైంది. సచివా లయంలో జరుగుతోన్న ఈ సమావేశానికి కొత్తగా మంత్రులుగా బాధ్యతలు చేపట్టిన గడ్డం వివేక్, అడ్లూరి లక్ష్మణ్, వాకిటి శ్రీహరి క్యాబినెట్ భేటీకి హాజరయ్యారు. వానాకాలం పంటలకు రికార్డుస్థాయిలో రైతు భరోసా పంపిణీ, రెవెన్యూ సదస్సులు ముగిసిన నేపథ్యంలో తదుపరి కార్యాచరణ, స్పోర్ట్స్ పాలసీ, కాళేశ్వరం ప్రాజెక్టు, ఏపీ తలపెట్టిన గోదావరిబనకచర్ల ప్రాజెక్టును అడ్డుకోవడానికి తదుపరి కార్యాచరణపై మంత్రివర్గం చర్చించనుంది.

## గిరిజన ప్రాంత యువత అన్ని రంగాల్లో ముందుండేందుకు పోలీస్ శాఖ కృషి

* **అడిషనల్ ఎస్పీ నరేందర్**



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: గిరిజన ప్రాంతాలలో నివాసం ఉంటున్న యువత అన్ని రంగాల్లో ముందుండేందుకు పోలీస్ శాఖ కృషి చేస్తుందని అడిషనల్ ఎస్పీ నరేందర్ అన్నారు. రవాణా శాఖ అధికారుల సహకారంతో గుండాల పోలీసుల ఆధ్వర్యంలో గుండాల మండలంలోని 100 మంది యువకులకు డ్రైవింగ్ లైసెన్సులను ఇప్పించడం జరిగినది. వారికి కొత్తగూడెం జిల్లా అడిషనల్ ఎస్పీ (ఆపరేషన్స్) జి.నరేందర్ చేతుల మీదుగా లైసెన్స్ కాపీలను అందజేశారు. ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పీ(ఆపరేషన్స్) జి. నరేందర్ మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో,ఏజెన్సీ ప్రాంతాల్లో నివసించే యువతకు పోలీస్ శాఖ అన్ని రకాలుగా అండగా ఉంటుందని తెలిపారు.వారికి క్రీడా పోటీలు నిర్వహించడం,మెడికల్ క్యాంపు లు నిర్వహించడం,ఉద్యోగాలు సాధించేలా వారిని ప్రోత్సహించి కోచింగ్ ఇప్పించడం వంటి కార్యక్రమాలను చేపట్టడం జరుగుతుందని అన్నారు.కొంతమంది ఏజెన్సీ ప్రాంత యువత మద్యానికి బానిసలై వాహనాలను నడుపుతూ రోడ్డు ప్రమాదాలకు గురై తమ ప్రాణాలను పోగొట్టుకుంటున్నారని అన్నారు. కనీసం డ్రైవింగ్ లైసెన్సులు కూడా లేకుండా పోలీసుల వాహన తలిఖీలలో పట్టుబడుతున్నారని అన్నారు. జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఆదేశాల మేరకు జిల్లాలోని గిరిజన ప్రాంతాలు , మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో నివసించే ఆదివాసీ ప్రజలకు,మైదాన ప్రాంతాల్లోని వలస గిరిజన యువతకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో వివిధ రకాల కార్యక్రమాలను చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు డి.యస్.పి. యన్.చంద్రభాను,గుండాల సీఐ లోడిగ రవీందర్,గుండాల యస్.ఐ రవూఫ్ , గుండాల పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు..



## పేద ప్రజల అభివృద్ధే ధ్యేయంగా ప్రజా ప్రభుత్వం పని చేస్తుంది

* **ఇల్లందు నియోజకవర్గం శాసన సభ్యులు కోరం కనకయ్య**

ప్రజాస్ఫూర్తి, ఇల్లందు: రాష్ట ప్రభుత్వం ఆర్థికంగా ఇబ్బందులో ఉన్నప్పటికి పేద ప్రజల అభివృద్ధే ధ్యేయంగా ప్రజా ప్రభుత్వం పని చేస్తుందని ఇల్లందు నియోజకవర్గం శాసన సభ్యులు కోరం కనకయ్య అన్నారు. ఇల్లందు మండలం బొజ్జాయిగూడెం,సుదిమళ్ళ,బాలాజి నగర్,సుభాష్ నగర్,రాఘబోయిన గూడెం గ్రామాలలో రాష్ట ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పేద ప్రజలకు అందిస్తున్న ఇందిరమ్మ ఇళ్ళ పథకం లబ్ధిదారుల ఇళ్ళ భూమి పూజా కార్యక్రమంలో ఇల్లందు నియోజకవర్గం శాసన సభ్యులు కోరం కనకయ్య తో పాటు ఇల్లందు మార్కెట్ కమిటి చైర్మెన్ బానోత్ రాంబాబు పాల్గోన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాలలో అర్హులైన పేదలందరికి ఇందిరమ్మ ఇళ్ళు ఇస్తాం,సంక్షేమ పథకాలు అమలు చేస్తామన్నారు. గ్రామిణ ప్రాంతాలు అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్న కాంగ్రెస్ పార్టీని రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో అన్ని స్థానాలలో గెలుపించి ప్రజా ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు మండలం మాజీ ఎంపిపి, వైస్ ఎంపిపి చీమల నాగరత్నం, మండల రాము, మోకాళ్ళ వెంకటమ్మ, ఇల్లందు మండల పార్టీ అధ్యక్షులు పులి సైదులు, నాయకులు కాకాటి భార్గవ్,పూనెం సురేందర్,శివ,తాటి భిక్షం,సొసైటి చైర్మెన్ మెట్ల క్రిష్ణ, ప్రసన్న కుమార్ యాదవ్,ధనుంజయ్, అరెం కిరణ్, మాజీ సర్పంచులు కల్తి పద్మ, పాయం స్వాతి, చీమల వెంకటేశ్వర్లు, కునుసోత్ రాము , చెన్నూరి క్రిష్ణ తదితరులు పాల్గోన్నారు

## ప్రమాదాలకు కారణమవుతున్న విద్యుత్ స్తంభాలను వెంటనే మార్చాలి

* **బిఆర్ఎస్ పార్టీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి.వివేకానంద్**




కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : ప్రమాదాలకు కారణమవుతున్న విద్యుత్ స్తంభాలను వెంటనే మార్చాలని బిఆర్ఎస్ పార్టీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి. వివేకానంద్ అన్నారు. గాజుల రామారం డివిజన్ గాజుల రామారం గ్రామ చౌరస్తాలో రోడ్డు విస్తరణలో భాగంగా రోడ్డుకు అడ్డంగా ఉండి ప్రమాదాలకు కారణమవుతున్న విద్యుత్ స్తంభాలను బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు విస్తరణలో అడ్డుగా ఉండి అనేక ప్రమాదాలకు కారణమవుతున్న విద్యుత్ స్తంభాలను వెంటనే పక్కకు మార్చాలని అన్నారు ఆదేశించారు కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా షాపూర్ నగర్ ఉషోదయ టవర్స్ చౌరస్తా, కుత్బుల్లాపూర్ మున్సిపల్ చౌరస్తా లతో పాటు గాజుల రామారం చౌరస్తాలను అభివృద్ధి పరిచామని అన్నారు. రోడ్డు విస్తరణ పనులు పూర్తయిన విద్యుత్ అధికారులను రోడ్డుపక్కకు స్తంభాలను మార్చకపోవడంపై అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడిన. విద్యుత్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్థానికులు ఎం.లక్ష్మణ్, పి.యాదగిరి యాదవ్, పెంటయ్య, శివయ్య, గోవర్ధన్, సురేష్,పాక్స్ డైరెక్టర్ పరుష శ్రీనివాస్ యాదవ్, బిఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు విజయ్ రాంరెడ్డి, సీనియర్ నాయకులు కస్తూరి బాల్ రాజ్, అడ్వకేట్ కమలాకర్, నవాబ్ భాయ్, తెలంగాణ సాయి, సాయి బాబా, చెట్ల వెంకటేష్, చిన్నా చౌదరి, బాబీ చౌదరి, వాహిద్, గోవర్ధన్ రెడ్డి, శివా నాయక్, ఆసిఫ్, చంద్ర గౌడ్, ప్రసాద్, జునైద్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ బస్సు సౌకర్యాన్ని డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల వాసులు సద్వినియోగం చేసుకోవాలి

* **బిఆర్ఎస్ పార్టీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి.వివేకానంద్**



కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : ఆర్టీసీ బస్సు సౌకర్యాన్ని డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల వాసులు సద్వినియోగం చేసుకోవాలని బిఆర్ఎస్ పార్టీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ అన్నారు. గాజుల రామారం డివిజన్ కైసర్ నగర్ లోని డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల సముదాయం నుంచి బాలా నగర్ వరకు నూతనంగా ఏర్పాటుచేసిన ఆర్టీసీ బస్సు సర్వీసును సోమవారం ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్ పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధికి దోహదం, ప్రగతిరథ ఛక్రమన్నారు. పేదలు అధికంగా నివసించే డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల సముదాయం నుంచి నగరంలోని వివిధ ప్రాంతాలకు ఆర్టీసీ బస్సును ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు.. ఉదయం 7:00 గంటలకు, 8:30 గంటలకు తిరిగి సాయంత్రం 4:00 గంటలకు, 5:00 గంటలకు బయల్దేరి వెళ్ళే ఈ ఆర్టీసీ బస్సు సౌకర్యాన్ని డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల వాసులు, సమీప కాలనీల వాసులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం ఆర్టీసీ బస్సులో ఎమ్మెల్యే ప్రయాణించారు. ఈ కార్యక్రమంలో 2 బి.హెచ్.కె డిగ్నిటీ హౌసింగ్ ఫ్లాట్ ఓనర్స్ కో ఆపరేటివ్ సొసైటీ అధ్యక్షులు సాధుల వేణు, సలహాదారులు సాజిద్, ఖాసీం, ఉపాధ్యక్షులు ఎం.డి. అతిక్ రెహమాన్, ప్రధాన కార్యదర్శి ఎస్.కె.వలి, కోశాధికారి బింగి యాదగిరి, పాక్స్ డైరెక్టర్ పరుష శ్రీనివాస్ యాదవ్, బిఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు విజయ్ రాంరెడ్డి, సీనియర్ నాయకులు కస్తూరి బాల్ రాజ్, అడ్వకేట్ కమలాకర్, నవాబ్ భాయ్, తెలంగాణ సాయి, సాయి బాబా, చెట్ల వెంకటేష్, చిన్నా చౌదరి, బాబీ చౌదరి, వాహిద్, గోవర్ధన్ రెడ్డి, శివా నాయక్, ఆసిఫ్, చంద్ర గౌడ్, ప్రసాద్, జునైద్, మహిళా అధ్యక్షురాలు సంధ్యా రెడ్డి, నాయకురాలు మామి తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా కేంద్రంలో నూతన హంగులతో స్టేడియం

**– ఎమ్మెల్యే కూనంనేని, కలెక్టర్ జితేష్ వి.పాటిల్**



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: రానున్న కాలంలో జిల్లా కేంద్రంలో 50 ఎకరాల విస్తీర్ణంలో అన్ని రకాల నూతన హంగులతో స్టేడియం నిర్మాణం చేపడతామని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. జిల్లా యువజన, క్రీడల విభాగం, తెలంగాణా ఒలంపిక్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం 'ఒలంపిక్ డే రన్-2025' నిర్వహించారు. కొత్తగూడెం రైల్వే స్టేషన్ నుండి ప్రకాశం స్టేడియం వరకు నిర్వహించిన రన్ సందర్భంగా ఒలంపిక్ టార్చ్ (జ్యోతి)ను జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, శాసనసభ్యులు కూనంనేని సాంభశివరావు కలిసి జ్యోతిని వెలిగించారు. సీఎం కప్-2024 ఓవరాల్ ఛాంపియన్ ట్రోఫీ భద్రాద్రి జిల్లాకు దక్కడం ఆనందంగా ఉందన్నారు. క్రీడాకారులకు అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తామని చెప్పారు. ఈ సంవత్సరము ఒలంపిక్ డే స్లోగన్ 'మూవ్, లెర్న్, డిస్కవర్ అండ్ టుగెదర్ ఫర్ ఎ బెటర్ వరల్డ్' ప్రపంచ వ్యాప్తంగా క్రీడల ద్వారానే ఇది సాధ్యం అవుతుందని అన్నారు. ఈ కార్యక్రమములో జిల్లా యువజన మరియు క్రీడల అధికారి ఎం. పరంధామ రెడ్డి, ఎస్‌జిఎఫ్ సెక్రటరీ నరేష్, క్రీడాసంఘాల ప్రతినిధులు నాగ సీతారాములు, యుగెందర్ రెడ్డి, మహిధర్, వై.వి.రావు, కాసి హుస్సేన్, రమేష్, ఉదయ్, నిరంజన్, మొగిలి, నబి, కళ్యాణ్, నాగేందర్, మల్లికార్జున్, క్రీడాకారులు, ఎన్‌సిసి, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు, యువకులు, తదితరులు పాల్గొన్నారు.

# పిచ్చి వేశాలు వేస్తే.. తొక్కిపట్టి నార తీస్తాం: పవన్ కల్యాణ్ హెచ్చరిక

వైసీపీ నేతలకు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. ఏడాది పాలనపై కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేసిన 'సుపరిపాలనలో తొలి అడుగు' సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసీపీ నేతలు అధికారంలో ఉన్నప్పుడు చేసిన అరాచకాలే ఇప్పుడూ చేస్తున్నారని మండిపడ్డారు. గొంతులు కోస్తామనే బెదిరింపులకు, తాటాకు చప్పుళ్లకు భయపడేది లేదని అన్నారు. అవన్నీ సినిమాల్లోనే బాగుంటాయని ఎద్దేవా చేశారు. శాంతిభద్రతల విషయంలో ఏమాత్రం ఉపేక్షించేది లేదు. మేం చట్టబద్ధంగా వ్యవహరించాలి కాబట్టి పద్ధతిగా ఉంటున్నాం. ఎన్నో దెబ్బలు తిని, ఇక్కడి వరకు వచ్చాం. పిచ్చివేషాలు వేస్తే



తొక్కి నారతీస్తాం. ప్రజల్లో భయాందోళన కలిగించాలని చూస్తే సహించం'' అని పవన్ హెచ్చరించారు. అంతేకాదు.. వైసీపీకి ప్రతిపక్షానికి కావాల్సిన సంఖ్య కూడా లేదు.. కానీ ప్రతిపక్ష హోదా కావాలని గగ్గోలు పెడుతున్నారని మండిపడ్డారు. ప్రతిపక్ష హోదా ఇవ్వడం లేదనే రోజురోజుకూ దిగజారి వ్యవహరిస్తున్నారని సీరియస్ అయ్యారు. ప్రజలకు సుపరిపాలన అందించాలనే లక్ష్యంతోనే తాము సైలెంట్ అభివృద్ధి చేసుకుంటూ ముందుకు పోతున్నాం. మా మౌనాన్ని చేతగాని తనంగా చూడొద్దు. మరోసారి శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ప్రయత్నాలు చేస్తే చట్టపరంగా కఠిన శిక్షలు తీసుకుంటామని స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు.

## మాజీ మంత్రి పేర్ని నాని, కిట్టుకు భారీ ఊరట

మాజీ మంత్రి పేర్ని నాని, ఆయన తనయుడు కిట్టు కు భారీ ఊరట లభించింది. నకిలీ ఇళ్ల పట్టాల వ్యవహారంలో వాళ్లపై అభియోగాలు ఉన్న విషయం తెలిసిందే. దీంతో వాళ్లిద్దరిని పోలీసులు అరెస్ట్ చేయబోతున్నారని, అలాగే క్రిమినల్ కేసులు నమోదు చేయబోతున్నారని ప్రచారం జరుగుతోంది. దీంతో పేర్ని నాని, కిట్టు హైకోర్టు ను ఆశ్రయించారు. ఈ కేసులో తమకు అరెస్ట్ నుంచి ఉపశమనం కల్పించాలని పిటిషన్ దాఖలు చేశారు. ఈ మేరకు విచారణ చేపట్టిన ధర్మాసనం పోలీసులకు కీలక ఆదేశాలు జారీ చేసింది.




నకిలీ ఇళ్ల పట్టాల కేసులో పేర్ని నాని, కిట్టును నోటీసులు ఇచ్చి విచారించాలని సూచించింది. క్రిమినల్ కేసులు నమోదు చేసే ముందు వారి నుంచి వివరణ తీసుకోవాలని ఆదేశించింది.

## రాష్ట్రంలో వ్యవస్థలు దిక్కుమాలిపోయాయి

**: మాజీ మంత్రి బొత్స తీవ్ర స్థాయిలో ఫైర్**

రాష్ట్రంలో వ్యవస్థలు దిక్కుమాలిపోయాయని మాజీ మంత్రి, ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ తీవ్ర విమర్శలు చేశారు. వైసీపీ అధినేత, మాజీ సీఎం జగన్ కారు ఢీకొని సింగయ్య మృతి చెందిన ఘటనపై టీడీపీ నేతలు చేస్తున్న ఆరోపణలపై ఆయన స్పందించారు. జగన్ పర్యటనలో పోలీసుల వైఫల్యం కనిపించిందన్నారు. మాజీ సీఎం అని కూడా చూడకుండా సరైన భద్రత కల్పించలేదని ఆరోపించారు. సింగయ్య మృతిపై టీడీపీ నేతలు చెప్పిన ప్రకారం పోలీసులు విచారణ జరుపుతున్నారన్నారు. తొలుత జగన్ వాహనం ఢీకొట్టలేదని ఎస్పీ తెలిపారని, ఆ



తర్వాత మాట మార్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో చంద్రబాబు, లోకేశ్ , పవన్ కల్యాణ్ భద్రత ఇబ్బందులు పడ్డారా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో దిక్కుమాలిన, దిగజారిపోయిన పాలన సాగుతోందని బొత్స తీవ్ర స్థాయిలో మండిపడ్డారు.

## మార్కులు తక్కువ వచ్చాయని బాలికను కొట్టి చంపిన తండ్రి..

మహారాష్ట్ర సంగలీ జిల్లా నెలకరంజి గ్రామంలో విషాదం చోటు చేసుకుంది. మార్కులు తక్కువ వచ్చాయని కన్న కూతురిని కొట్టి చంపాడు తండ్రి. 17ఏళ్ల సాధన భోంస్లే డాక్టర్ కావాలని కలలు కన్నది. తండ్రి ధోండిరం భోంస్లే ప్రిన్సిపాల్ కాగా చదువు ఒత్తిడి ఎక్కువగానే ఉండేది. సాధనకు పదో తరగతిలో 93శాతం మార్కులు వచ్చాయి. దీంతో నీట్‌కు ప్రిపేర్ అవుతోంది. అయితే నీట్ ప్రాక్టీస్ టెస్ట్‌లో తండ్రి అంచనాలను అందుకోలేకపోయింది. దీంతో మార్కులు ఎందుకు తగ్గాయనగా.. తండ్రి చదువులోని లోపాలను ఎత్తి చూపింది సాధన. దీంతో కోపంతో చెక్కతో తల మీద బాదాడు. తల్లి, అన్న అడ్డుపడినా చితకబాదాడు. గాయాలయ్యాక ఆమెను హాస్పిటల్‌కు తీసుకెళ్దామని తల్లి అభ్యర్థించినా తండ్రి ఒప్పుకోలేదు. ట్రీట్మెంట్ ఇప్పించలేదు. నెక్స్ట



డే యోగా డే ఉండటంతో తండ్రి స్కూల్‌కు వెళ్లి వచ్చేసరికి స్పృహ లేకుండా పడిపోయింది సాధన. తీవ్రగాయాల కారణంగా హాస్పిటల్ చేరేలోగానే చనిపోయిందని.. పోస్టుమార్టం రిపోర్ట్‌లో తేలింది. దీంతో తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. ధోండిరంను అరెస్ట్ చేశారు. ఈ న్యూస్ సోషల్ మీడియాలో వైరల్ కాగా ఇది క్రమశిక్షణలో పెట్టే విధానం అస్సలే కాదు.. కచ్చితంగా హత్యగానే పరిగణించాలని, కఠిన శిక్ష విధించాలని డిమాండ్ చేస్తున్నారు నెటిజన్లు.

## దేశంలోని ఐదు అసెంబ్లీ స్థానాల ఉపఎన్నికల ఫలితాలు విడుదల

నాలుగు రాష్ట్రాల్లో జరిగిన ఐదు అసెంబ్లీ ఉపఎన్నికల ఫలితాలు విడుదలయ్యాయి. గుజరాత్‌లో రెండు స్థానాలకు ఉపఎన్నికలు జరగ్గా చెరో స్థానం బీజేపీ, ఆప్ కైవసం చేసుకున్నాయి. కాడిలో బీజేపీ అభ్యర్థి రాజేంద్రకుమార్ గెలుపొందగా, విశావదర్‌లో ఆప్ అభ్యర్థి గోపాల్ విజయం సాధించారు. పంజాబ్ లూథియానా వెస్ట్‌లో ఆప్ అభ్యర్థి సంజీవ్ గెలుపొందారు. అంతే కాకుండా కేరళలోని నిలంబూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి ఆర్యధన్ విజయం సాధించారు. బెంగాల్‌లో టీఎంసీ అభ్యర్థి అలిఫా విజయం సాధించారు. ఈ రోజు



ఉదయం 8 గంటలకు నాలుగు రాష్ట్రాల్లోని ఉపఎన్నికల స్థానాలకు సంబంధించిన కౌంటింగ్ ప్రక్రియ మొదలైంది. ప్రజలు, విశ్లేషకులు ఈ ఫలితాల కోసం ఎంతో ఆసక్తితో ఎదురుచూశారు. ఈ నియోజకవర్గాల్లోని ఎమ్మెల్యేల మరణాలు, రాజీనామాల కారణంగా ఎన్నికలు నిర్వహించబడ్డాయి.

## ప్రియుడు' పెళ్లిచేసుకున్నాడని..

# భగ్నప్రేమికురాలి బాంబు బెదిరింపులు!

తాను ప్రేమించిన వ్యక్తి వేరే మహిళను పెళ్లి చేసుకున్నాడన్న అక్కసుతో ఓ మహిళా టెకీ ప్రతీకార చర్యలకు దిగింది. తనకున్న సాంకేతిక పరిజ్ఞానంతో అతడిని ఇరకాటంలో పెట్టేందుకు యత్నించింది. ఈ క్రమంలోనే అతడి పేరిట నకిలీ ఈమెయిల్ ఐడీలు, డార్క్ వెబ్, వీపీఎన్‌ల ద్వారా 12 రాష్ట్రాల్లోని ఆయా ప్రాంతాలకు బాంబు బెదిరింపు సందేశాలు పంపింది. తన ఆచూకీ లభ్యం కాకుండా ఎత్తులు వేసినప్పటికీ.. చివరకు సైబర్ పోలీసుల చేతికి చిక్కింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రెనే జోషిల్డా అనే మహిళ చెన్నైలోని ఓ ప్రముఖ ఎంఎన్‌సీలో సీనియర్ కన్సల్టెంట్‌గా పనిచేస్తోంది. ఓ వ్యక్తిని ఆమె వన్‌సైడ్ లవ్ చేసింది. అతడినే వివాహం



చేసుకోవాలనుకుంది. అతడు వేరే మహిళను పెళ్లి చేసుకోవడంతో.. తట్టుకోలేకపోయింది. అతడి ప్రతిష్ఠను దిగజార్చాలనుకుంది. ఈ క్రమంలోనే నకిలీ ఈమెయిల్ ఐడీలు, డార్క్ వెబ్, వీపీఎన్‌ల ద్వారా గుజరాత్, తెలంగాణ, రాజస్థాన్, పంజాబ్, తమిళనాడు తదితర 12 రాష్ట్రాల్లోని ఆయా ప్రాంతాలకు బాంబు బెదిరింపు సందేశాలు పంపింది. అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియం, బీజే వైద్యకళాశాల, రెండు పాఠశాలలూ ఈ జాబితాలో ఉన్నాయి. ఓ పాఠశాల యాజమాన్యం ఈ వ్యవహారంపై స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ క్రమంలోనే సైబర్ పోలీసులు రంగంలోకి దిగారు. ఇతర రాష్ట్రాల పోలీసులతోనూ సమన్వయం చేసుకున్నారు. తన గుర్తింపు, లోకేషన్ బయటపడకుండా ఆమె తెలివిగా వ్యవహరించిందని, కానీ.. చిన్న తప్పిదంతో దొరికిపోయిందని పోలీసులు తెలిపారు. చెన్నైలోని నివాసంలో ఆమెను అరెస్టు చేసినట్లు చెప్పారు.

## 'రాజ్యసభకు వెళ్తున్నారా?' క్లారిటీ ఇచ్చేసిన కేజ్రీవాల్..

# అసెంబ్లీ ఉపపోరులో గెలుపుపై హర్షం

దిల్లీ: రాజ్యసభకు ఎంట్రీ ఇవ్వబోతున్నారంటూ జరుగుతోన్న ప్రచారంపై ఆప్ జాతీయ కన్వీనర్, దిల్లీ మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ స్పందించారు. తాను రాజ్యసభకు వెళ్లడంలేదని స్పష్టం చేశారు. పంజాబ్‌లోని లుధియానా పశ్చిమ అసెంబ్లీ నియోజకవర్గానికి జరిగిన ఉప ఎన్నికల్లో ఆప్ అభ్యర్థిగా బరిలో నిలిచిన ఆ పార్టీ రాజ్యసభ సభ్యుడు సంజీవ్ అరోడా విజయం సాధించారు. దీంతో ఆయన రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేస్తే.. ఖాళీ అయ్యే ఈ స్థానం నుంచి కేజ్రీవాల్ పెద్దల సభలో అడుగు పెట్టబోతున్నారంటూ విపక్షాలు పలు వ్యాఖ్యానాలు చేస్తూ వచ్చాయి. అయితే, తాను రాజ్యసభకు వెళ్లట్లేదని క్లారిటీ ఇచ్చిన కేజ్రీవాల్.. ఖాళీ అయ్యే రాజ్యసభ సీటు నుంచి ఎవరు పోటీ చేయాలనేది ఆప్ రాజకీయ వ్యవహారాల కమిటీ నిర్ణయం తీసుకుంటుందన్నారు.

**గుజరాత్ ప్రజల చూపు మావైపే..**

మరోవైపు, గుజరాత్‌లోని విశావదర్ అసెంబ్లీ స్థానానికి జరిగిన ఉప ఎన్నికల్లో ఆప్ విజయం సాధించడంపై కేజ్రీవాల్ హర్షం వ్యక్తం చేశారు. గుజరాత్ ప్రజలు భాజపాతో విసిగివేసారిపోయారని, ఇప్పుడు వారంతా ఆప్‌వైపే చూస్తున్నారన్నారు. గుజరాత్‌లో రెండు అసెంబ్లీ స్థానాలకు ఉప ఎన్నికలు జరగ్గా.. విశావదర్‌లో ఆప్ అభ్యర్థి విజయకేతనం ఎగురవేశారు. ఈ సందర్భంగా కేజ్రీవాల్ మీడియాతో మాట్లాడుతూ.. ఆప్‌ని ఓడించేందుకు భాజపా, కాంగ్రెస్ పంజాబ్, గుజరాత్ ఎన్నికల్లో పోటీ చేస్తే.. ప్రజలు వారిని తిరస్కరించారన్నారు. పంజాబ్‌లోని లుధియానా పశ్చిమ స్థానంలోనూ ఆప్‌ను గెలిపించడం ద్వారా పంజాబ్ ప్రజలు తమ ప్రభుత్వ పనితీరుకు ఆమోదం తెలిపారన్నారు. గుజరాత్‌లో భాజపా, ఆప్ మధ్యే ప్రత్యక్ష పోటీ ఉందన్న ఆయన.. భాజపాకు కాంగ్రెస్ కీలుబొమ్మగా మారిపోయిందని ఆరోపించారు.

*** ఉప పోరులో పట్టునిలుపుకొన్న ఆప్.. కేరళలో ఎల్డీఎఫ్‌కు షాక్!**

దేశ వ్యాప్తంగా జూన్ 19న ఐదు అసెంబ్లీ స్థానాలకు ఉప ఎన్నికలు జరగ్గా.. సోమవారం ఓట్ల లెక్కింపు చేపట్టారు. ఈ ఉప ఎన్నికల్లో గుజరాత్‌లో ఆప్ ఒక స్థానాన్ని కైవసం చేసుకొని సత్తా చాటింది. విశావదర్ సీటు నుంచి భాజపా అభ్యర్థి కిరీట్ పటేల్‌పై ఆప్ నేత గోపాల్ ఇటాలియా 17వేల పైచిలుకు ఓట్లతేడాతో విజయం సాధించారు. గుజరాత్‌లో భాజపాకు పూర్తి ఆధిపత్యం ఉన్నప్పటికీ.. 2007 నుంచి విశావదర్ స్థానాన్ని గెలుచుకోలేకపోతోంది. అయితే, గత ఎన్నికల్లో ఈ సీటులో ఆప్ కైవసం చేసుకున్నప్పటికీ.. ఎమ్మెల్యే భూపేంద్ర భయానీ రాజీనామా చేసి భాజపాలో చేరారు. దీంతో ఆ స్థానానికి జరిగిన ఉప ఎన్నికల్లో మళ్లీ ఆప్ విజయం సాధించింది. అలాగే, గుజరాత్‌లో కాడి అసెంబ్లీ స్థానానికి జరిగిన ఉప ఎన్నికల్లో భాజపా అభ్యర్థి రాజేంద్ర చావ్డా విజయం సాధించారు. కాగ్రెస్ అభ్యర్థి రమేశ్ చావ్డాపై జయకేతనం ఎగురవేశారు. పంజాబ్‌లోని లుధియానా వెస్ట్ సీటుకు జరిగిన ఉప ఎన్నికల్లో అధికార ఆప్ విజయకేతనం ఎగురవేసింది. కాంగ్రెస్ అభ్యర్థి భరత్ భూషణ్ ఆషుపై ఆప్ అభ్యర్థి, రాజ్యసభ ఎంపీ సంజీవ్ అరోడా 10,637 ఓట్ల తేడాతో విజయం సాధించారు. ఇక్కడ ఆప్ అభ్యర్థి అరోడాకు 35,179 రాగా.. కాంగ్రెస్ అభ్యర్థి ఆషుకు 24,542 ఓట్లు, భాజపా అభ్యర్థి జివాన్ గుప్తాకు 20,323



ఓట్లు; అకాలీదళ్ అభ్యర్థికి కేవలం 8,203 ఓట్లు మాత్రమే పోలయ్యాయి. ఇక్కడ ఆప్ ఎమ్మెల్యే గురుప్రీత్ బస్సీ గోగి మరణంతో ఉప ఎన్నిక అనివార్యమైంది. కేరళలో నిలంబర్ అసెంబ్లీ నియోజకవర్గానికి జరిగిన ఉప ఎన్నికల్లో అధికార ఎల్డీఎఫ్‌కు షాక్ తగిలింది. ఈ సీటులో కాంగ్రెస్ సారథ్యంలోని యూడీఎఫ్ అభ్యర్థి ఆర్యదాన్ షౌకత్ సీపీఎం అభ్యర్థిపై 11,077 ఓట్ల ఆధిక్యంతో విజయం సాధించారు. షౌకత్ ప్రముఖ కాంగ్రెస్ నేత ఆర్యదాన్ ముహమ్మద్ తనయుడు. గత ఎన్నికల్లో ఎల్డీఎఫ్ మద్దతుతో స్వతంత్ర అభ్యర్థిగా గెలిచిన పీవీ అన్వర్ రాజీనామాతో ఈ సీటుకు ఉప ఎన్నిక అనివార్యమైంది. మరోవైపు, పశ్చిమ బెంగాల్‌లోని కాలీగంజ్ అసెంబ్లీ స్థానానికి జరిగిన ఉప ఎన్నికల్లో అధికార తృణమూల్ కాంగ్రెస్ విజయం సాధించింది. టీఎంసీ అభ్యర్థి అలీఫా అహ్మద్‌కు 32,308 ఓట్లు రాగా.. కాంగ్రెస్ అభ్యర్థికి కేవలం 13,144 ఓట్లు మాత్రమే వచ్చాయి. భాజపా అభ్యర్థి 11,987 ఓట్లతో మూడో స్థానానికి పరిమితమయ్యారు. టీఎంసీ సిట్టింగ్ ఎమ్మెల్యే నసీరుద్దీన్ అహ్మద్ మృతితో ఇక్కడ ఉప ఎన్నిక అనివార్యం కాగా.. ఆయన కుమార్తె అలిఫా అహ్మద్‌ను దీదీ బరిలో నిలిపారు.

# దిల్లీలోని ఫంక్షన్ హాల్‌లో భారీ అగ్నిప్రమాదం

దిల్లీ: దేశ రాజధాని నగరం దిల్లీలో భారీ అగ్నిప్రమాదం జరిగింది. మోతీనగర్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో పెద్ద ఎత్తున మంటలు చెలరేగడంతో అక్కడున్న వారంతా భయాందోళనకు గురయ్యారు. రాత్రి 8.47గంటల సమయంలో మంటలు చెలరేగగా.. దట్టమైన పొగలు అలముకున్నాయి. ఈ ఘటనపై సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది 18 ఫైరింజన్లతో అక్కడికి చేరుకొని మంటలను అదుపు చేస్తున్నారు. ఈ ఘటనపై పూర్తి సమాచారం ఇంకా తెలియాల్సి ఉంది.













# కార్నర్లకీ కళ వచ్చిందోచ్!

ఇంట్లో ప్రతి గదికీ, ప్రతి ప్రదేశానికీ ప్రాముఖ్యత ఇస్తాం. చూడచక్కగా, కళాత్మకంగా తీర్చిదిద్దుకుంటాం. కానీ, గదుల్లోని మూలల్ని మాత్రం అలానే వదిలేస్తాం. కాస్తంత సృజనాత్మకత, ఓపిక ఉండాలే కానీ, అక్కడా కళ తేవొచ్చు. వాటినీ ఓ అద్భుతమైన ప్రదేశాల్లా మార్చొచ్చు. అందుకు సాయపడేవే 'కార్నర్ షెల్ఫ్'లు. మూలల్ని అందంగా సర్దుకోవటానికి ఇవే కీలకం మరి. చెక్క, గాజు, ప్లాస్టిక్... మెటీరియల్ ఏదైనా సరే కోరుకున్న రీతిలో వీటిని డిజైన్ చేయించుకోవచ్చు. ఓ మంచి రీడింగ్ స్పేస్‌లానో, స్టోరేజ్‌లానో అమర్చుకోవచ్చు. పుస్తకాల మధ్యలో పచ్చని మొక్కలు, డెకరేటివ్ వస్తువుల్లాంటివి పెడతారా లేదా అచ్చం మొక్కలతోనే నింపేస్తారా అన్నది మీ ఇష్టం. కాకుంటే లైటింగ్ యాడ్ చేయటం మాత్రం మర్చిపోవద్దు. కార్నర్ ల్యాంప్‌లూ, చిన్న చిన్న హ్యాంగింగ్‌లూ అదనపు అందాన్నిచ్చేవే. ఎక్కువ ఫ్లోర్ స్పేస్‌ను వాడకుండా, ఇలా కార్నర్‌లోని ప్రతి అంగుళాన్నీ వాడుకోవటం వల్ల ఇల్లు విశాలంగా, ప్రశాంతంగా అనిపిస్తుంది. లేదూ ఒకవేళ ఇంటి గదులు చిన్నవి అంటారా... మల్టీ ఫంక్షనల్ ఫర్నిచర్‌ను కార్నర్లలో పెట్టేయండి. కార్నర్ సోఫా, బిల్ట్ ఇన్ కార్నర్ డెస్క్‌లతో సర్దేయండి. ఎలా చేసినా సరే మూలలకు కొత్త లుక్ రావటం ఖాయం! ఏమంటారు?









# పోషకాలు పోకుండా..!



**పోషకాలు పోకుండా ఉండాలంటే.. కొన్ని రకాల కూరగాయలు వండే విషయంలో.. కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. అవేమిటో చూడండి మరి..!**

### బంగాళాదుంపలు..

బంగాళాదుంపల్ని మరీ చిన్న చిన్న ముక్కలుగా కోసి ఉడికించకూడదు. అలా చేస్తే వాటిలోని పోషక విలువలు పోతాయి. అందుకే బంగాళాదుంపల్ని బాగా కడిగి మధ్యలో చిన్నగా కోసి పొట్టుతో ఉడికించాలి. అలా చేయడం వల్ల దుంపల పొట్టులో ఉండే పీచు పోదు. ఇతర పోషకాలూ అందుతాయి.

### క్యాబేజీ..

చాలామంది క్యాబేజీని ఉడికించి కూర చేస్తారు. ఇలా ఉడికించినప్పుడు అందులో శరీరానికి మేలు చేసే గుణాలన్నీ వృథాగా పోతాయి. అందుకే దీన్ని ఉడికించేటప్పుడు నీళ్లలో నూనె లేదా కాస్త వెన్న వేయాలి. అప్పుడు పోషకాలు పోవు అంటున్నారు





నిపుణులు. అలాగే క్యాబేజీని అతిగా ఉడికించినా, వేయించినా సల్ఫర్ విడుదలై దాని రుచి మారే అవకాశముంటుంది.

### ఉల్లిపాయలు..

సలాడ్లు, బర్గర్లు, శాండ్‌విచ్ వంటి వాటిల్లో పచ్చి ఉల్లిపాయ ముక్కలు వేస్తుంటాం. నిజానికి ఇది మంచి పద్ధతి. పచ్చి ఉల్లిపాయల్లో సల్ఫర్ ఉంటుంది. ఇది జీవక్రియ రేటును పెంచుతుంది. కాబట్టి వాటిని వేయించకూడదు.

మాంసంచేపలు..

వీటిని ఎక్కువ మంట మీద ఉడికిస్తే అందులో ఉండే మాంసకృత్తులు నశించిపోతాయి. ఆరోగ్యానికి హాని చేసే కార్సినోజెనిక్ కాంపౌండ్లు, హెటరో సైక్లిక్ అమైన్స్ విడుదలవుతాయి. అందుకే తక్కువ మంట మీద ఉడికించాలి.



# మీ జరీ నిజమైనదేనా?

పట్టు దుస్తులంటే ప్రతి ఒక్కరికీ ఓ ఎమోషన్. ప్రత్యేక సందర్భాలకోసం కొన్న వీటిని ఎంతో జాగ్రత్తగా భద్రపరుచుకుంటాం. అయితే, మెరిసేదంతా బంగారం కాదన్నట్లు... పట్టు పేరుతో అమ్మేదంతా స్వచ్ఛమైనదీ కాదు. అచ్చమైన జరీ అంచుల్ని తలపించేలా అనుకరణ రకాలెన్నో మార్కెట్‌ని ముంచెత్తుతున్నాయి. అయితే అసలైన జరీ, సింథటిక్ మెరుపుల మధ్య తేడాను అర్థం చేసుకోగలగాలి. ప్యూర్ జరీని రాగితో ఎలక్ట్రోప్లేట్ చేసిన పట్టు దారాలను ఉపయోగించి చేస్తారు. ఆపై వెండితో చుట్టి బంగారు పూతతో పూర్తి చేస్తారు. అయితే, దీనికి విరుద్ధంగా టెస్టెడ్ జరీ అనుకరణలు, చౌకైన లోహాల చుట్టూ ప్లాస్టిక్, ల్యూరెక్స్ వంటివి ఉపయోగించి చేస్తారు. దూరం నుంచి చూస్తే ఆ మెరుపు మనల్ని మాయ చేయొచ్చు. కానీ, ఇవి ఎక్కువ కాలం మన్నవు. ఇక, ప్యూర్ జరీ సాఫ్ట్‌గా, వార్మ్ గ్లోతో ఉంటుంది. కానీ, సింథటిక్ జరీ ఎక్కువ మెరుపుతో, మెటాలిక్‌లుక్‌తో మెరిసిపోతుంది. కృత్రిమ రకాలతో పోల్చితే స్వచ్ఛమైన జరీ బరువుగా ఉంటుంది. పైగా ఇది గట్టిగా నేసి ఉంటుంది. ఫ్యాబ్రిక్ వెనకభాగం వదులుగా గజిబిజిగా ఉంటే అది స్వచ్ఛమైనది కాదు. వెనక దారాలు లేకుండా చక్కగా ఉండాలి. వీటిని టెస్ట్ చేయడానికి ప్రసిద్ధ బ్రాండ్‌లు ప్రత్యేక యంత్రాలనూ ఉపయోగిస్తున్నాయి. చెక్ చేసుకోవచ్చు.

# పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు..

## నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు



**ముంబై:** దేశీయ స్టాక్ మార్కెట్లు సోమవారం నష్టాల్లో ముగిశాయి. ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ.. అగ్రరాజ్యం అమెరికా ఇరాన్‌లోని మూడు అణుకేంద్రాలపై మిస్సైళ్లతో విరుచుకుపడింది. అమెరికా దాడుల ప్రభావం మార్కెట్‌పై పడింది. మదుపరులు అప్రమత్తంగా వ్యవహరించారు. ఫలితంగా మార్కెట్లు పతనమయ్యాయి. క్రితం సెషన్‌తో పోలిస్తే సెన్సెక్స్ 81,704.07 పాయింట్ల వద్ద సెన్సెక్స్ నష్టాల్లో మొదలైంది. ఇంట్రాడేలో 82,169.67 పాయింట్ల గరిష్టాన్ని తాకిన సెన్సెక్స్.. అత్యల్పంగా 81,476.76 పాయింట్లకు పడిపోయింది. చివరకు 511.38 పాయింట్ల నష్టంతో 81,896.79 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 140.50 పాయింట్లు తగ్గి 24,971.90 వద్ద స్థిరపడింది. ట్రేడింగ్‌లో దాదాపు 1,794 షేర్లు లాభపడగా.. మరో 2,113 షేర్లు పతనమయ్యాయి. ట్రెంట్, భారత్ ఎలక్ట్రానిక్స్, హిందాల్కో ఇండస్ట్రీస్, అదానీ ఎంటర్‌ప్రైజెస్, బజాజ్ ఫైనాన్స్ నిఫ్టీలో ప్రధానంగా లాభాలను ఆర్జించాయి. ఇన్ఫోసిస్, ఎల్‌అండ్‌టీ, హీరో మోటోకార్ప్, ఎం అండ్ ఎం, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ నష్టపోయాయి. రంగాల వారీగా చూస్తే ఐటీ, ఎఫ్ఎంసీజీ, ఆటో, బ్యాంక్, టెలికాం 0.3 నుంచి 1.5 శాతం పతనమయ్యాయి. కన్స్యూమర్ డ్యూరబుల్స్, మీడియా, మెటల్, క్యాపిటల్ గూడ్స్ 0.3-4 శాతం పెరిగాయి. బీఎస్ఈ మిడ్‌క్యాప్ ఇండెక్స్ 0.2 శాతం, స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 0.6 శాతం పెరిగాయి.

## ఊరటనిచ్చిన బంగారం..



**న్యూఢిల్లీ:** బంగారం ధరలు కొనుగోలుదారులకు స్వల్ప ఊరటనిచ్చాయి. ఆభరణాల వ్యాపారులు, స్టాకిస్టులు అమ్మకాలు జరుపడంతో ధరలు దిగివచ్చాయి. దేశ రాజధాని ఢిల్లీ నగరంలో ధరలు పతనమయ్యాయి. 24 క్యారెట్స్ గోల్డ్‌పై రూ.160 తగ్గింది. దీంతో తులం ధర రూ.99,800కి చేరింది. అదే సమయంలో 22 క్యారెట్స్ పసిడి రూ.150 తగ్గి.. తులానికి రూ.99,100కి తగ్గింది. అదే సమయంలో వెండి ధర స్థిరంగా కొనసాగుతున్నది. కిలో వెండి ధర రూ.1,05,200 పలుకుతున్నది ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ తెలిపింది. మరో వైపు గ్లోబల్ మార్కెట్‌లో స్పాట్ గోల్డ్ ఔన్స్‌కు స్వల్పంగా తగ్గి.. 3,365.40 పడిపోయింది. సోమవారం ధరలు పెరిగినా.. ఆ తర్వాత తగ్గాయని కోటక్ సెక్యూరిటీస్‌లోని కమోడిటీ రీసెర్చ్ ఏవీపీ కైనత్ చైన్వాలా తెలిపారు.

టెహ్రాన్‌పై వాషింగ్టన్ దాడులకు దిగడంతో పెట్టుబడిదారులు ఇరాన్ ఎలా స్పందిస్తుందో వేచి చూస్తున్నారు. కీలకమైన పరిస్థితులను పెట్టుబడిదారులు నిశితంగా పరిశీలిస్తున్నారని పేర్కొన్నారు. యూఎస్ ఫెడరల్ బ్యాంక్ చైర్మన్ జెరోమ్ పావెల్ ప్రసంగం, యూఎస్ జీడీపీ డేటా, కోర్ పర్సనల్ కంజమ్షన్ ఎక్స్‌పెండేచర్ ఇన్‌ఫ్లమేషన్ డేటాపై పెట్టుబడిదారులు దృష్టి సారించారని చెప్పారు. ఫెడరల్ రిజర్వ్ నుంచి మిశ్రమ సంకేతాల మధ్య ద్రవ్య విధానం దిశపై కొత్త సూచనలు ఇచ్చే అవకాశం ఉన్నది. యూఎస్, యూకేతో సహా ప్రధాన ఆర్థిక వ్యవస్థల పీఎంఐ డేటా గ్లోబల్ ఫైనాన్స్ వెల్త్ గురించి కొత్త సూచనలు ఇస్తుందని కమోడిటీ మార్కెట్ నిపుణులు పేర్కొంటున్నారు. పీఎంఐ అంటే పర్చేజింగ్ మేనేజర్స్ ఇండెక్స్.

తయారీ-సేవా రంగం కార్యకలాపాలను కొలిచే ఆర్థిక సూచిక. ఫ్లాష్ పీఎంఐ అనేది నెలాఖరుకి కొన్ని రోజుల ముందు విడుదలయ్యే నివేదిక. ఎంకే గ్లోబల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ పరిశోధన విశ్లేషకురాలు రియా సింగ్ ప్రకారం.. జూన్‌లో ఇప్పటివరకు దేశీయ బంగారం ధరలు 4శాతం పెరిగాయి. అయితే, బలహీనమైన డిమాండ్ కారణంగా ప్రపంచ ధరలు తగ్గుతున్నాయి. పండుగల షాపింగ్ సమయంలో మందగమనం ఉన్నప్పటికీ, గోల్డ్‌బార్స్, నాణేలకు, ముఖ్యంగా 10 గ్రాముల నాణేలపై పెట్టుబడులు డిమాండ్ బలంగా ఉంది. ద్రవ్యోల్బణ భయాలు, తక్కువ తయారీ ఖర్చులు దీనికి కారణమని మార్కెట్ నిపుణులు పేర్కొంటున్నారు. ఇదిలా ఉండగా.. హైదరాబాద్‌లో బంగారం ధరల విషయానికి వస్తే.. 22 క్యారెట్స్ గోల్డ్ రూ.92,300 ఉండగా.. 24 క్యారెట్స్ గోల్డ్ రూ.1,00,690 పలుకుతున్నది. వెండి ధర విషయానికి వస్తే కిలోకు రూ.1.20లక్షలు పలుకుతున్నది.

## పశ్చిమాసియాలో ఉద్రిక్తతలతో భారీగా పెరగనున్న ముడి చమురు ధరలు..!

### భారత్ డెఫిసిట్‌పై ప్రభావం ఛాన్స్ ఉందన్న ఐసీఆర్ఏ..!



**న్యూఢిల్లీ:** పశ్చియాసియాలో ఉద్రిక్తతలు రోజు రోజుకు మరింత తీవ్రమవుతున్నాయి. ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య యుద్ధంలో అమెరికా ప్రవేశించి అణుస్థావరాలను ధ్వంసం చేసింది. దాంతో భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు కొత్త మలుపు తీసుకోగా.. ఇది భారత జీడీపీని ప్రభావితం చేసే అవకాశం ఉందని క్రెడిట్ రేటింగ్ ఏజెన్సీ ఐసీఆర్ఏ అంచనా వేసింది. వాస్తవానికి అమెరికా దాడుల తర్వాత హర్మూజ్ జలసంధిని మూసివేసేందుకు ఇరాన్ పార్లమెంట్ ఆమోదం తెలిపింది. ఈ క్రమంలో ముడి చమురు ధరలు 10 డాలర్లు పెరిగితే.. భారతదేశ నికర చమురు దిగుమతులు దాదాపు 13 నుంచి 14 డాలర్లకు వరకు పెరుగుతాయని ఐసీఆర్ఏ అంచనా వేసింది. ఫలితంగా భారతదేశ కరెంట్ ఖాతా లోటు జీడీపీలో 0.3 శాతం పెరుగుతుంది. కరెంట్ ఖాతా లోటు అనేది ఒక దేశ కరెంట్ ఖాతాలో దిగుమతులు-ఎగుమతుల మధ్య అసమతుల్యతను సూచిస్తుంది. ఎగుమతుల కంటే దిగుమతులపై ఎక్కువ డబ్బు ఖర్చు చేసే పరిస్థితి ఎదురవుతుంది.

2026 ఆర్థిక సంవత్సరంలో ముడి చమురు సగటు ధర బ్యారెల్‌కు 80 నుంచి 90 డాలర్ల వరకు పెరిగితే.. కరెంట్ కాతా లోటు ప్రస్తుత జీడీపీ అంచనా నుంచి జీడీపీలో 1.5 నుంచి 1.6 శా వరకు పెరిగే అవకాశం ఉందని రేటింగ్ సంస్థ పేర్కొంది. ఇది ఆర్థిక సంవత్సరంలో ఆర్థిక వ్యవస్థపై ఒత్తిడి తెస్తుంది. ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య ఈ వివాదం జూన్ 13న మొదలైందని నివేదిక తెలిపింది. ఆ తర్వాత ముడి చమురు ధర బ్యారెల్‌కు 64 నుంచి 65 డాలర్లుగా ఉన్న ధర 74 నుంచి 75 డాలర్ల వరకు పెరిగింది. అమెరికా రంగ ప్రవేశంతో ఇరాన్ హర్మూజ్ జలసంధిని మూసివేయనున్నట్లు ప్రకటించింది. దాంతో ప్రపంచ చమురు సరఫరాలో తీవ్ర అంతరాయం ఏర్పడే అవకాశం ఉంది. హర్మూజ్ జలసంధి ప్రపంచంలోనే కీలకమైన సముద్రమార్గాల్లో ఒకటి. దాదాపు 20 మిలియన్స్ బ్యారెల్స్ ముడి చమురు, లిక్విఫైడ్ నేచురల్ గ్యాస్ (ఎల్ఎన్‌జీ) మూడో వంతు ఇక్కడి నుంచే వెళ్తుంది. ఈ జలసంధి దాదాపు 30 మైళ్ల వెడల్పు ఉంటుంది. ఇరాన్-ఒమన్ మధ్య ఈ జలసంధి ఉంటుంది.

అయితే, చమురు ధరల పెరుగుదల ప్రభావం దిగుమతులకే పరిమితం కాదని ఐసీఆర్ఏ అంచనా వేసింది. ఇది టోకు ధరల సూచిక లో 80 నుంచి 100 బేసిస్ పాయింట్లు, వినియోగదారుల ధరల సూచికలో 20 నుంచి 30 బేసిస్ పాయింట్లు పెరిగేందుకు పరిస్థితులు దారి తీయవచ్చని చెప్పింది. భారత్ ఇరాక్, సౌదీ అరేబియా, కువైట్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ నుంచి ముడి చమురును దిగుమతి చేసుకుంటుంది.

# హెడింగ్లే టెస్టులో రాహుల్ శతక గర్జన

### మ్యాచ్‌పై పట్టుబిగించిన భారత్..

**లీడ్స్:** లీడ్స్‌లోని హెడింగ్లేలో జరుగుతున్న తొలి టెస్టు రెండో ఇన్నింగ్స్‌లో కేఎల్ రాహుల్(100 నాటౌట్) సెంచరీతో విజృంభించాడు. లంచ్ తర్వాత స్పీడ్ పెంచిన రాహుల్.. షోయబ్ బషీర్ బౌలింగ్‌ల్ రెండు రన్స్ తీసి శతకం పూర్తి చేసుకున్నాడు. దాంతో, డ్రెస్సింగ్ రూమ్ బాల్కనీ నుంచి టీమిండియా కెప్టెన్ గిల్ సహా ఆటగాళ్లంతా చప్పట్లు కొడుతూ రాహుల్‌ను అభినందించారు. రాహుల్ సెంచరీ, పంత్ హాఫ్ సెంచరీలతో కదం తొక్కగా భారత్ స్కోర్ 240 దాటింది.



తొలి ఇన్నింగ్స్‌లో ఇంగ్లండ్‌ను ఆలౌట్ చేసి స్వల్ప ఆధిక్యం సాధించిన టీమిండియా.. మ్యాచ్‌పై పట్టుబించింది. ఓవర్‌నైట్ స్కోర్ 90/2తో నాలుగో రోజు బ్యాటింగ్‌కు దిగిన భారత్ ఆదిలోనే శుభ్‌మన్ గిల్(8) వికెట్ కోల్పోయింది. ఫామ్‌లో ఉన్న గిల్‌ను కార్సే బౌల్డ్ చేసి ఇంగ్లండ్‌కు బ్రేకిచ్చాడు. కానీ, ఆ తర్వాత వచ్చిన రిషభ్ పంత్( నాటౌట్) వచ్చిరాగానే బాదకుండా క్రీజులో కుదురుకోవడానికి ప్రాధాన్యమిచ్చాడు. అయితే అతడికి కార్సే ఓవర్లో లైఫ్ లభించింది. అనంతరం టంగ్ ఓవర్లో రాహుల్ స్లిప్‌లో కట్ షాట్ ఆడగా.. అక్కడే కాచుకొని ఉన్న హ్యారీ బ్రూక్ క్యాచ్ అందుకోలేకపోయాడు.

స్టోక్స్ టీమ్ ఎంత ప్రయత్నించినా సరే రాహుల్, పంత్ వికెట్ ఇవ్వలేదు. నింపాదిగా ఆడిన వీళ్లు జట్టు ఆధిక్యాన్ని పెంచుతూ పోయారు. లంచ్ తర్వాత గేర్ మార్చిన పంత్ అర్ధ శతకం సాధించగా.. ఆ కాసేపటికే బషీర్ ఓవర్లో డబుల్స్ తీసి రాహుల్ సెంచరీ సంబురాలు చేసుకున్నాడు. స్టోక్స్ సేన బౌలింగ్ ఎత్తుల్ని చిత్తు చేస్తున్న ఈ ద్వయం ఇప్పటికే 152 పరుగుల భాగస్వామ్యంతో జట్టును పటిష్ట స్థితిలో నిలిపింది. ప్రస్తుతం టీమిండియా 251 పరుగుల ఆధిక్యంలో ఉంది.



## ఎన్నో సెంచరీలు మిస్సయ్యాను: సౌరవ్ గంగూలీ

**కోల్‌కతా:** టీమిండియా మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ.. ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో తన మనోగతాన్ని వివరించారు. తన కెరీర్‌లో ఎన్నో సెంచరీలను చేసే అవకాశాలను మిస్ అయినట్లు పేర్కొన్నారు. వాస్తవానికి అంతర్జాతీయ క్రికెట్‌లో గంగూలీ 38 సెంచరీలు చేశారు. కానీ మరికొన్ని సెంచరీలు చేసే అవకాశాన్ని కోల్పోయినట్లు తెలిపారు. ఎడమ చేతి బ్యాటర్ గంగూలీ.. టెస్టులు, వన్డేల్లో కలిపి మొత్తం 18575 రన్స్ చేశారు. అతను 311 వన్డేలు, 113 టెస్టులు ఆడారు. అయితే వీటిల్లో పలు సందర్భాల్లో సెంచరీలు చేసే అవకాశాన్ని చేజార్చుకున్నట్లు చెప్పారు. మీరేదైనా విషయం గురించి చింతిస్తున్నారా అని అడిగిన ప్రశ్నకు బదులిస్తూ గంగూలీ ఈ వ్యాఖ్యలు చేశారు.

ఎన్నో సెంచరీలు మిస్సయ్యానని, వాస్తవానికి మరిన్ని సెంచరీలు చేయాల్సి ఉందని, ఎన్నోసార్లు 90, 80 రన్స్ స్కోర్ చేసినట్లు తెలిపారు. క్రికెట్ గణాంకాల ప్రకారం సుమారు 30 సార్లు సెంచరీకి చేరువలో గంగూలీ ఔటైనట్లు తెలుస్తోంది. ఒకవేళ గంగూలీ ఆ ఇన్నింగ్స్‌లను సెంచరీలుగా మలిస్తే, అప్పుడు అతను 50 సెంచరీల మైలురాయిని దాటేవాడు. ఒంటరిగా ఉన్న సమయంలో.. బ్యాటింగ్ వీడియోలను చూస్తుంటానని, తన భార్య సారా లండన్‌లో ఉంటుందని, ఆమెకు దూరంగా ఉన్న సమయంలో ఆ వీడియోలు చూస్తానని, యూట్యూబ్‌కు వెళ్లి



వీడియోలు చూస్తానని, 70ల్లో ఔట్ అవ్వగానే .. సెంచరీ చేయాల్సి ఉండే అన్న భావన వస్తుందన్నాడు. కానీ గతాన్ని మార్చలేమన్నారు.

వన్డేల్లో గంగూలీ మొత్తం 72 హాఫ్ సెంచరీలు చేశారు. ఇక టెస్టుల్లో 35 అర్ధశతకాలు సాధించారు. కెప్టెన్‌గా కొన్ని సందర్భాల్లో కీలకమైన ఆటగాళ్లను డ్రాప్ చేయడం పెద్ద సమస్య అన్నారు. పరిస్థితులకు తగినట్లు ఆ నిర్ణయాలు తీసుకోవాల్సి వచ్చేదని, అనిల్ కుంబ్లే గొప్ప బౌలర్ కానీ, పరిస్థితుల వల్ల అతన్ని పలుమార్లు తప్పించాల్సి వచ్చిందన్నారు. తనకు ఆస్ట్రేలియా ఫేవరేట్ ప్రత్యర్థి జట్టు అని, గ్లెన్ మెక్‌గ్రాత్ చాలా ప్రమాదకర బౌలర్ అన్నారు.

## ఐసీసీ చీఫ్‌గా మాజీ ఛాంపియన్



### తొలి ఆఫ్రికా మహిళగా రికార్డు..

**ముంబై:** అంతర్జాతీయ ఒలింపిక్ సంఘంలో కొత్త అధ్యాయం మొదలైంది. 133 ఏళ్ల చరిత్రలో తొలిసారి ఒక మహిళ చీఫ్‌గా ఎంపికయ్యారు. ఒలింపిక్ డే సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో థామస్ బాస్చ్ నుంచి సోమవారం క్రిస్టీ కొవెంట్రీ బాధ్యతలు స్వీకరించారు. తద్వారా ఐఓసీ అత్యున్నత పదవి చేపట్టిన మొదటి మహిళగా.. తొలి ఆఫ్రికా దేశస్థురాలిగా క్రిస్టీ చరిత్ర సృష్టించారు. లసాన్నేలో జరిగిన కార్యక్రమంలో ప్రస్తుత అధ్యక్షుడు బాస్చ్ ఆమెకు ఒలింపిక్ హౌస్ తాళాలు అప్పగించారు. 41 ఏళ్ల క్రిస్టీ జూన్ 23 నుంచి ఐఓసీ చీఫ్ హోదాలో విధులు నిర్వర్తించనున్నారు. ఒలింపిక్ డే సందర్భంగా తనను ఐఓసీ కొత్త చీఫ్‌గా నియమించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భావోద్వేగానికి లోనయ్యారు. 'నా రాక్ స్టార్స్.. నాకు స్ఫూర్తి దివ్వెలు వీళ్లు' అంటూ తన ఇద్దరు కూతుళ్ల వంక చూస్తూ ఆనందబాష్పాలు రాల్చారు క్రిస్టీ. ఎనిమిదేళ్ల పాటు ఆమె ఈ పదవిలో కొనసాగనున్నారు. జింబాబ్వే దిగ్గజ స్విమ్మర్ అయిన క్రిస్టీ 2004, 2008లో ఒలింపిక్ పతకం సాధించారు.

## ఇతర రాష్ట్రాలకు ఆడాలని ఉంది.. దయచేసి ఎన్‌ఓసీ ఇవ్వండి..!

**న్యూఢిల్లీ:** దేశవాళీ సీజన్‌కు సమయం దగ్గరపడుతున్న వేళ భారత యువ క్రికెటర్ పృథ్వీ షా కీలక నిర్ణయం తీసుకున్నాడు. కొన్నాళ్లుగా ముంబైకి ప్రాతినిధ్యం వహిస్తున్న షా కొత్త జట్టుకు మారాలనుకుంటున్నాడు. అందుకని ఆలస్యం చేయకుండా ముంబై క్రికెట్ అసోసియేషన్ కు లేఖ రాశాడు. తనకు ఈ సీజన్‌లో రాష్ట్ర జట్టుకు ఆడాలనే ఉద్దేశం లేదని.. ఇతర రాష్ట్రాల జట్ల నుంచి ఆఫర్స్ వస్తున్నాయని ఆ లేఖలో పేర్కొన్న షా.. నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ ఇవ్వాలని అభ్యర్థించాడు.

గత సీజన్‌లో ఫిట్‌నెస్ లేదంటూ అతడిని రంజీ ట్రోఫీ స్క్వాడ్ నుంచి తప్పించింది ఎంసీఏ. దాంతో, ఈసారి కూడా పక్కనపెడితే తన భవిష్యత్ నాశనం అవుతుందనుకున్న షా.. ముంబైని వీడేందుకు సిద్ధమయ్యాడు. ఈ విషయాన్ని సోమవారం ఎంసీఏ మీడియాకు వెల్లడించింది. 'ఎన్‌ఓసీ కావాలని పృథ్వీ షా మాకు ఉత్తరం రాశాడు. ఈ విషయాన్ని మేము అపెక్స్ కౌన్సిల్ దృష్టికి తీసుకెళ్లాం. అతడికి త్వరలోనే ఎన్‌ఓసీ మంజూరు చేస్తాం' అని ఎంసీఏ సెక్రటరీ తెలిపాడు క్రిక్‌బజ్ కథనం రాసుకొచ్చింది.

ఎన్‌ఓసీ కోసం లేఖ రాసిన లేఖలో షా తన



కెరియర్ పుంజుకొనే అవకాశాల్ని ప్రస్తావించాడు. తనకు ప్రొఫెషనల్ క్రికెట్ ఆడేందుకు ఆఫర్లు వస్తున్నాయని తెలిపాడు. 'ప్రస్తుతం నా కెరియర్ మీద దృష్టి సారించాలనుకుంటున్నా. ఇతర రాష్ట్రాల బోర్డుల తరఫున ప్రొఫెషనల్ క్రికెట్ ఆడాలనుకుంటున్నా. నన్ను నేను మెరుగుపరుచుకోవడంతో పాటు క్రికెటర్‌గా మునపట్లో ఆడినట్టు ఆడాలని లక్ష్యంగా పెట్టుకున్నా. కాబట్టి దయచేసి నాకు ఎన్‌ఓసీ ఇవ్వండి. అప్పుడు నేను అధికారికంగా దేశవాళీ సీజన్‌లో ఇతర జట్లకు ఆడగలను' అని షా తన లేఖలో వెల్లడించాడు.

### సచిన్ వారసుడిగా..

దేశవాళీలో రికార్డు సెంచరీలతో సచిన్ టెండూల్కర్ వారసుడిగా కితాబులందుకున్న షా.. 2018లో టీమిండియా జెర్సీ వేసుకున్నాడు. తొలి మ్యాచ్‌లో సెంచరీతో భావి తారగా ప్రశంసలందుకున్న అతడు.. అంచనాలను అందుకోలేక పోయాడు. విధ్వంసక బ్యాటర్‌గా జట్టుకు ఎంతో పనికొస్తాడని అభిమానులను నిరాశపరుస్తూ.. పాతాళానికి పడిపోయాడు. ఫిట్‌నెస్ కోల్పోవడం.. చెడు తిరుగుళ్లు కూడా అతడి ఫామ్‌పై ప్రభావం చూపాయి. ఇప్పటివరకూ ఈ యంగ్‌స్టర్ దేశం తరఫున ఐదు టెస్టులు, ఆరు వన్డేలు, ఒక టీ20 ఆడాడు.

# అతిపెద్ద డిజాస్టర్ మూవీ థగ్‌లైఫ్

### ఫెయిల్యూర్ ఆశించలేదు...క్షమించండి

### ప్రేక్షకులకు మణిరత్నం వినతి




**టాకీస్:** భారీ అంచనాల మధ్య థియేటర్లలో అడుగుపెట్టిన అనేక పాన్ ఇండియా సినిమాలు, బాక్సాఫీస్ వద్ద చతికిలపడిన విషయం తెలిసిందే. వాటిలో అత్యంత విఫలమైన సినిమాగా కమల్ హాసన్, మణిరత్నం కాంబినేషన్‌లో వచ్చిన 'థగ్ లైఫ్' నిలిచింది. సుమారు రూ.200 కోట్ల భారీ బడ్జెట్‌తో తెరకెక్కిన ఈ సినిమా, బాక్సాఫీస్ వద్ద కేవలం పదుల కోట్ల వసూళ్లకే పరిమితమైంది. ఈ ఫెయిల్యూర్‌తో నిర్మాతలు, డిస్ట్రిబ్యూటర్లు కలిపి రూ.150 కోట్లకు పైగా నష్టాలను ఎదుర్కొన్నారు. ఈ మూవీ జూన్ 5న ప్రపంచ వ్యాప్తంగా 4917 స్క్రీన్లలో విడుదల అయ్యింది. కమల్ హాసన్ అభిమానుల్లో భారీ హైప్ ఉన్నప్పటికీ, మొదటి రోజు వసూళ్లు కేవలం రూ.15.5 కోట్లు మాత్రమే వసూలు అయ్యాయి. ఇక కమల్ హాసన్ తన 70 ఏళ్ల వయసులోనూ శక్తివేల్ పాత్రలో అద్భుతంగా నటించారని విమర్శకులు ప్రశంసించాగా. శింబు కూడా యాక్టింగ్‌లో అస్సలు తగ్గలేదు. కానీ అతని పాత్రకు స్క్రీన్ టైమ్, డెప్త్ లేకపోవడంతో పూర్తిగా ప్రభావం చూపలేకపోయాడు. ఏ.ఆర్. రెహమాన్ మ్యూజిక్, రవి కె. చంద్రన్ సినిమాటోగ్రఫీ, శ్రీకర్ ప్రసాద్ ఎడిటింగ్ వంటి టెక్నికల్ యాస్పెక్ట్స్ ఉన్నా, స్టోరీలో బలం లేకపోవడం వాటన్నింటినీ వెనక్కి నెట్టింది. ఆరు రోజుల్లో సగానికి పైగా స్క్రీన్స్ తగ్గిపోయాయి. థియేటర్లలో ఈ సినిమా ఎనిమిది వారాలు ఆడాలని ప్లాన్ చేసినప్పటికీ, నాలుగు వారాల్లోనే ఓటీటీ ప్లాట్‌ఫామ్ నెట్‌ఫ్లిక్స్‌లో రిలీజ్ కాబోతుంది. ముఖ్యంగా కర్ణాటకలో రిలీజ్ అవ్వకపోవడం మరో మైనస్. అలా మొత్తంగా 'థగ్ లైఫ్' బాక్సాఫీస్ ఫెయిల్యూర్ నిర్మాతలకు రూ.150 కోట్లకు పైగా నష్టాన్ని మిగిల్చింది. తన దర్శకత్వంలో వచ్చిన 'థగ్ లైఫ్'ప్రేక్షకుల అంచనాలను అందుకోలేకపోయిందని దర్శకుడు మణిరత్నం ఆవేదన చెందారు. ఈ విషయంలో ఆడియన్స్‌కు క్షమాపణలు చెప్పారు. ప్రేక్షకులు మరో క్లాసిక్‌ను ఆశించారని అన్నారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో 'థగ్ లైఫ్' మూవీ ఫెయిల్యూర్‌పై స్పందించారు. 'మా ఇద్దరి నుంచి మరో 'నాయకుడు'ను ఆశించిన వారికి నేను చెప్పగలిగేది ఒక్కటే. మమ్మల్ని క్షమించండి. ఆ సినిమా కంటే తక్కువ దాన్ని చేయడం మా ఉద్దేశం కాదు. అలాంటి ఆలోచన మాకెప్పుడూ లేదు. అలా ఎలా చేయాలనుకుంటాం. మేం పూర్తిగా భిన్నమైనదాన్ని అందించాలనుకున్నాం. ఎక్కువ అంచనా వేయడంతో మేం అనుకోని ఫలితాన్ని అందుకున్నాం. మేము అందించిన దానికంటే ఆడియన్స్ భిన్నంగా కోరుకున్నారని అర్థం చేసుకున్నా' అని మణిరత్నం అన్నారు. వీరిద్దరి కాంబినేషన్‌లో వచ్చిన 'నాయకుడు' అప్పట్లో సంచలనం సృష్టించింది. దాదాపు 37 ఏళ్ల తర్వాత వీరిద్దరి కాంబోలో తెరకెక్కిన చిత్రమే 'థగ్ లైఫ్'. దీంతో ఈ సినిమాపై ప్రేక్షకులు భారీ అంచనాలు పెట్టుకున్నారు.

# సితారే జమీన్ పర్..ఓ మంచి సినిమా

### ఎక్స్ వేదికగా మహేశ్‌బాబు ప్రశంసలు

**టాకీస్:** ఆమిర్ ఖాన్ ప్రధాన పాత్రలో తెరకెక్కిన చిత్రం 'సితారే జమీన్ పర్' ఇటీవల ప్రేక్షకుల ముందుకువచ్చి ఈ అందరి హృదయాలను కదిలించేస్తోంది. ఇప్పటికే నెట్టింట ప్రశంసలు అందుకున్న ఈ సినిమాకు మహేశ్ బాబు కూడా ఫిదా అయ్యారు. ఎక్స్ వేదికగా







దీనిపై పోస్ట్ పెట్టారు. 'అద్భుతమైన సినిమా. ఆమిర్ ఖాన్ ఇతర క్లాసిక్ సినిమాల్లాగానే 'సితారే జమీన్ పర్' కూడా మిమ్మల్ని నవ్విస్తుంది, ఏడిపిస్తుంది, చప్పట్లు కొట్టేలా చేస్తుంది. 'సితారే జమీన్ పర్' చూశాక కచ్చితంగా చిరునవ్వుతో బయటకు వస్తారు' అంటూ చిత్రబృందాన్ని అభినందించారు. ఈనెల 20న ప్రేక్షకుల ముందుకువచ్చిన 'సితారే జమీన్ పర్' సామాన్యుల నుంచి సెలబ్రిటీల వరకూ అందరి మనసులను దోచుకుంటోంది. విడుదలకు ముందు ఏర్పాటుచేసిన ప్రత్యేక ప్రదర్శనల్లోనే పలువురు ప్రముఖులు దీనిపై ప్రశంసలు కురిపించారు. క్రికెట్ దిగ్గజం సచిన్ తెందుల్కర్, బాలీవుడ్ హీరో షారుక్‌ఖాన్, రాజ్యసభ ఎంపీ సుధామూర్తి దీనిపై ప్రశంసలు కురిపించారు. ఈ సినిమా సమాజంలో మార్పు తీసుకురాగలదని అభిప్రాయం వ్యక్తంచేశారు. మానసిక దివ్యాంగులను ఎవరూ తక్కువ చేసి చూడకూడదనే సందేశాత్మక చిత్రమిదన్నారు. 'తారే జమీన్ పర్'కు సీక్వెల్‌గా వచ్చిన చిత్రమిది. మానసికంగా సవాళ్లు ఎదుర్కొంటున్న వాళ్లకు ఓ కోచ్ బాస్కెట్ బాల్ క్రీడలో శిక్షణ ఇచ్చి, వాళ్లను మేటి ఆటగాళ్లుగా తీర్చిదిద్దే ఇతివృత్తంగా రూపొందింది. ఆమిర్‌ఖాన్ ఇందులో కోచ్‌గా కనిపించి సినీప్రియులను ఆకట్టుకుంటున్నారు.

# విజయ్ చివరి సినిమా జన నాయగన్ అంటూ ప్రచారం..

### ఎట్టకేలకి క్లారిటీ ఇచ్చిన దళపతి

**టాకీస్:** టాలీవుడ్‌లో పవన్ కళ్యాణ్‌కి ఎంత ఫ్యాన్ ఫాలోయింగ్ ఉందో, కోలీవుడ్‌లో విజయ్ కి అదే స్థాయిలో ఫ్యాన్ ఫాలోయింగ్ ఉంటుంది. వైవిధ్యమైన సినిమాలతో ప్రేక్షకులని అలరిస్తూ వస్తున్న విజయ్ ప్రస్తుతం జన నాయగన్ అనే చిత్రం చేస్తున్నారు. ఈ చిత్రం విజయ్ చివరి చిత్రం అంటూ జోరుగా ప్రచారం జరుగుతుంది. ఈ విషయాన్ని ఎప్పుడూ అధికారికంగా ప్రకటించలేదు. ఈ క్రమంలో సహనటి మమితా బిజు మాత్రం కొంత మేర క్లారిటీ ఇచ్చింది. జన నాయగన్ సినిమాలో దళపతి విజయ్ సోదరి పాత్రలో మమితా నటిస్తున్నట్లు తెలుస్తోంది.



ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతుండగా, షూటింగ్ విరామం సమయంలో విజయ్‌ని తన తదుపరి ప్రాజెక్ట్ గురించి మమిత అడిగిందట. 'జన నాయగన్' చిత్రమే మీ చివరి సినిమానా అని విజయ్‌ను అడిగాను. దానికి ఆయన 'ఆ విషయం ఇప్పుడే చెప్పలేను. అది 2026 ఎన్నికల ఫలితాలపై ఆధారపడి ఉంటుంది' అని ఆయన నాతో అన్నారు. ఈ సినిమా షూటింగ్ అయితే ఎంతో సరదాగా గడిచింది. చిత్రీకరణ ఆఖరి రోజు నాతో పాటు అందరం కూడా చాలా ఎమోషనల్ అయ్యాం. విజయ్ సార్ కూడా ఎంతో భావోద్వేగానికి గురయ్యారు అని మమితా చెప్పుకొచ్చింది.

అందుకే టీమ్‌తో కలిసి ఫొటోలు కూడా దిగలేకపోయామంటూ మమిత పేర్కొంది. ఇక సినిమాలో తన పాత్ర గురించి ఇప్పుడే ఏమీ చెప్పనని, తెరపైనే చూడాలని మమిత తెలిపారు. హెచ్. వినోద్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'జన నాయగన్' చిత్రాన్ని పొలిటికల్ యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందిస్తున్నారు. ఈ సినిమాలో విజయ్ సరసన పూజా హెగ్డే కథానాయికగా నటిస్తుండగా, వచ్చే ఏడాది జనవరి 9న ప్రేక్షకుల ముందుకు తీసుకురానుంది చిత్ర బృందం.



# వరుస హిట్లతో దూసుకుపోతున్న రష్మిక

### కుబేరలో అద్భుత నటన అంటూ నాగ్, చిరుల పొగడ్తలు

**టాకీస్:** నేషనల్ క్రష్ రష్మిక ఈ మధ్య వరుస హిట్స్ కొడుతూ గోల్డెన్ లెగ్‌గా మారింది. ఆమె ఇటీవలి కాలంలో నటించిన అన్ని చిత్రాలు మంచి విజయాలు సాధించాయి. రీసెంట్‌గా వచ్చిన కుబేర చిత్రం కూడా పెద్ద విజయం సాధించింది. కుబేర చిత్రం శేఖర్ కమ్ముల దర్శకత్వంలో తెరకెక్కగా, ఇందులో ధనుష్, రష్మిక, నాగార్జున ప్రధాన పాత్రలు పోషించారు. జూన్ 20న విడుదలైన ఈ చిత్రం మంచి విజయం సాధించింది. తమిళంలో కంటే తెలుగులోనే ఈ చిత్రం ఎక్కువగా ఆడేస్తోంది. తెలుగు, ఓవర్సీస్‌లో మాత్రం కుబేర దుమ్ముదులిపేస్తోంది. ఇప్పటికే అరవై కోట్లకు పైగా గ్రాస్ సాధించినట్టుగా సమాచారం.కుబేరా' చిత్రం బ్లాక్‌బస్టర్ టాక్ తెచ్చుకోవడంతో తాజాగా సక్సెస్ మీట్ నిర్వహించారు. ఈ సక్సెస్‌మీట్‌కి మెగాస్టార్ చిరంజీవి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా దర్శకుడు శేఖర్ కమ్ముల, నటులు నాగార్జున, ధనుష్‌లపై చిరంజీవి ప్రశంసల వర్షం కురిపించారు. అయితే ఈ ఈవెంట్‌లో రష్మిక మందన్నపై చిరంజీవి, నాగార్జున చేసిన కామెంట్లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. నాగార్జున మాట్లాడుతూ, 'శేఖర్ కమ్ముల ఇచ్చిన ఈ పాత్ర మొదట ఇబ్బందిగా అనిపించినా, నా పెర్ఫార్మెన్స్‌కి మంచి స్పందన రావడంతో చాలా సంతృప్తిగా ఉంది. ఆ క్రెడిట్ పూర్తిగా శేఖర్‌కే చెందుతుంది' అన్నారు. ఇక రష్మిక గురించి మాట్లాడుతూ.. ఆమెను అందరూ నేషనల్ క్రష్ అంటారు, ఇప్పటి నుండి నాకు క్రష్. క్షణక్షణంలో శ్రీదేవి ఎలా కనిపించారో, రష్మిక ఈ సినిమాలో అలా కనిపించింది అని వ్యాఖ్యానించారు. ఆయన మాటలపై రష్మిక ఎంతో సంతోషపడింది. ఇక మెగాస్టార్ చిరంజీవి కూడా రష్మికపై ప్రశంసలు కురిపిస్తూ ' నేను చెప్పాల్సింది నువ్వే చెప్పేశావ్ నాగ్. రష్మిక నేషనల్ క్రష్ మాత్రమే కాదు.. నా క్రష్ కూడా. నీ మొదటి సినిమా ఈవెంట్‌కి కూడా నేనే గెస్ట్‌గా వచ్చాను. అప్పటి నుంచి నీ అభినయాన్ని గమనిస్తున్నా . సినిమా సినిమాకి నీ ఇమేజ్ పెరుగుతూనే ఉంది. కుబేరా చిత్రంలో రష్మిక మొదట్లో మోసపోయే సీన్ చూస్తే నాలో సౌందర్యని గుర్తుకు తెచ్చింది. క్లైమాక్స్ ముందు చిన్న పిల్లాడిని చేతిలో పట్టుకున్నప్పుడు నీ యాక్టింగ్ అసాధారణంగా ఉంది. స్క్రీన్ మీద నువ్వు కనిపిస్తే నీ కళ్లకే అట్టిపడిపోతాం. నువ్వు కళ్లతోనే నటించగలవు. నువ్వు నేషనల్ క్రష్ కాదు? ఇంటర్నేషనల్ క్రష్' అంటూ చిరంజీవి రష్మికపై ప్రశంసలు కురిపించారు.





# డ్రగ్స్ కేసు.. చెన్నై పోలీసుల అదుపులో హీరో శ్రీరామ్



**టాకీస్:** కోలీవుడ్ లో డ్రగ్స్ వ్యవహారం ప్రకంపనలు పుట్టిస్తుంది. తమిళంతో పాటు తెలుగు, కన్నడ భాషల్లో అనేక చిత్రాల్లో నటించిన శ్రీరామ్ డ్రగ్స్ కేసులో అరెస్ట్ అయినట్టు తెలుస్తుంది. మాజీ ఏఐడీఎంకే నేత ప్రసాద్ నుంచి డ్రగ్స్ కొన్నట్లు ఆరోపణలు రావడంతో ఆయనతో సహా మరో ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేశారు. వారిని విచారిస్తున్న సమయంలో వారు ఇచ్చిన సమాచారంతో శ్రీరామ్‌ను కూడా అరెస్ట్ చేసి పోలీసులు విచారిస్తున్నారు. చెన్నై నార్కోటిక్స్ ఇంటెలిజెన్స్ యూనిట్ పోలీసులు నుంగంబాక్కం పోలీస్‌స్టేషన్‌కి తరలించి అక్కడే ఆయన్ని రెండు గంటల పాటు అనేక కోణాల్లో విచారించారు.

ఈ కేసులో శ్రీరామ్‌తో పాటు ప్రసాద్ సహా మరో ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితులను ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి బ్లడ్ శాంపిల్స్ సేకరించారు. శ్రీరామ్ డ్రగ్స్ కొనుగోలు చేసినట్లు ఆరోపణలు రావడంతో చెన్నై పోలీసులు విచారణ చేశారు. డ్రగ్స్ కేసులో అరెస్టైన వారు ఇచ్చిన సమాచారంతోనే నటుడిని చెన్నై పోలీసులు ఆయన్ను అదుపులోకి తీసుకున్నట్లుగా తెలుస్తోంది. అయితే శ్రీరామ్ అరెస్ట్ కోలీవుడ్‌లో తీవ్ర కలకలం రేపుతోంది. రాజీవ్ గాంధీ ప్రభుత్వ ఆసుపత్రిలో నటుడికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆయన నుంచి బ్లడ్ శాంపిల్స్‌ను సేకరించి అనంతరం అతడిని నుంగంబాక్కం స్టేషన్‌కు తరలించారు. దాదాపు రెండు గంటలుగా విచారిస్తున్నట్లు కోలీవుడ్‌లో వార్తలు వస్తున్నాయి.

శ్రీరామ్ అసలు పేరు శ్రీకాంత్ కాగా, ఆంధ్రప్రదేశ్‌కి చెందిన వ్యక్తి. సినిమాలపై ఇష్టంతో చెన్నైకి వెళ్లాడు. తన పేరును శ్రీరామ్‌గా మార్చుకున్నాడు. తమిళ చిత్రం రోజా కూటంతో హీరోగా ఎంట్రీ ఇవ్వగా, ఈ చిత్రం తెలుగులో రోజా పూలు పేరుతో విడుదలైంది. 'ఒకరికి ఒకరు' చిత్రంతో తెలుగు ప్రేక్షకులకు బాగా దగ్గర అయ్యారు. ఆడవారి మాటలకు అర్థాలే వేరులే, ఒకరికి ఒకరు తదితర చిత్రాలతో తెలుగువారికి దగ్గరయ్యారు. ఈ మధ్య 'హరికథ' అనే వెబ్ సిరీస్ ద్వారా ప్రేక్షకుల ముందుకొచ్చారు. ఇప్పుడు శ్రీరామ్ అరెస్ట్ సినీ ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది.

# ఓటీటీకి నేను కూడా సిద్ధమే

### నాగ్ నాకు స్ఫూర్తి అంటూ చిరు కామెంట్స్



**టాకీస్:** తాను కూడా ఓటీటీలోకి ఎంట్రీ ఇచ్చేందుకు సిద్ధమేనంటూ అగ్ర కథానాయకుడు చిరంజీవి సంచలన ప్రకటన చేశారు. తాజాగా జరిగిన 'కుబేర' సక్సెస్ మీట్‌లో తన స్పీచ్‌తో అందరినీ ఉత్సాహపరిచిన ఆయన నాగార్జునపై ప్రశంసల వర్షం కురిపించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. నాగ్ తనకు ఎన్నో విషయాల్లో స్ఫూర్తినిస్తుంటారని చెప్పారు. 'నాగార్జున ఎన్నో విషయాల్లో నాలో స్ఫూర్తినింపుతుంటారు. ఆరోగ్యం, నడవడిక, ఆలోచనలు, స్థితప్రజ్ఞత.. ఇలా ఎన్నో విషయాలు ఆయనలో నాకు నచ్చుతాయి. ఏం జరిగినా ఎంతో ప్రశాంతంగా ఉంటాడు. నేను కూడా భవిష్యత్తులో ఏమైనా అవసరం వచ్చి ఓటీటీలో సినిమాలు చేయాల్సి వచ్చినా రెడీ.. దానికి ఇప్పటినుంచే మానసికంగా సిద్ధంగా ఉండాలి. ఈ విషయంలోనూ నాగార్జున తీసుకున్న నిర్ణయం నాకు స్ఫూర్తి. ఓకే అన్నాను కదా అని రేపు ఉదయాన్నే స్క్రిప్టులు తీసుకొని వచ్చేయకండి' అంటూ సరదాగా చెప్పారు చిరంజీవి. ప్రస్తుతం ఈ కామెంట్స్ వైరల్‌గా మారాయి. త్వరలోనే ఆయన్ను ఓటీటీలో కూడా చూడొచ్చని అభిమానులు భావిస్తున్నారు. ఇప్పటికే సీనియర్ హీరోలంతా ఏదోరకంగా ఓటీటీ ప్రేక్షకులకు దగ్గరైన విషయం తెలిసిందే. పలు కార్యక్రమాలకు బాలకృష్ణ వ్యాఖ్యాతగా వ్యవహరిస్తూ ఆకట్టుకుంటున్నారు. వెంకటేశ్ 'రానా నాయుడు'తో అలరించారు. ఇక చిరు కూడా ఓటీటీలోకి ఎంట్రీ ఇస్తున్నారని గతేడాది వార్తలు వచ్చాయి. ఓటీటీలో తెరకెక్కే ప్రాజెక్టులకు కథే బలం. అందుకే బలమైన కథ కోసం వెతుకుతున్నారని.. కొంతమంది రచయితలకు చిరంజీవి తన వయసుకు తగిన బలమైన కథ రాయాలని సూచించినట్లు కూడా అప్పట్లో వార్తలు వచ్చాయి. తాజాగా ఈ ఓటీటీ కామెంట్స్‌పై మరోసారి ఈ విషయం తెర పైకి వచ్చింది.

# దేవిశ్రీ ప్రసాద్ వ్యాఖ్యల దుమారం



**టాకీస్:** టాలీవుడ్‌లో ఉన్నది ఉన్నట్లు బయటకు మాట్లాడే వ్యక్తుల్లో సంగీత దర్శకుడు దేవిశ్రీప్రసాద్ ఒకరు. తన వర్క్ గురించి, లేదా సినిమాకి సంబంధించిన ఏదైనా విషయంలో. దర్శక నిర్మాతలు మాట్లాడిన మాటలు నచ్చకపోతే.. సినిమా వేదికపైనే వారికి నిరభ్యంతరంగా సమాధానమిస్తాడు. అలాంటి దేవిశ్రీప్రసాద్ తాజాగా రెమ్యూనరేషన్ గురించి చేసిన హాట్ టాపిక్ గా మారాయి. జూన్ 20న విడుదలైన 'కుబేర' మూవీ మంచి కలెక్షన్లు సాధించగా, ఈ సందర్భంగా జరిగిన సక్సెస్ మీట్ లో చిరంజీవి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ ఈవెంట్‌లో దేవిశ్రీ ప్రసాద్ చేసిన కామెంట్లు విపరీతంగా వైరల్ అవుతున్నాయి. 'కుబేర నిర్మాత సునీల్ నారంగ్ గారు నా రెమ్యూనరేషన్ పూర్తిగా సినిమా విడుదలకు ముందే క్లియర్ చేశారు. సినిమా బ్లాక్ బస్టర్ అయింది. టైం కి పేమెంట్ కూడా వచ్చేసింది. మ్యూజిక్ బాగుందని పొగిడారు కూడా. అంతకంటే ఇంకేం కావాలి?' అని ఆనందం వ్యక్తం చేశారు. ఇకపోతే 'పేమెంట్ ఇస్తానని బాకీ పెట్టడం కంటే, మాట్లాడతానని బాకీ పెట్టడం మంచిదే' అని వ్యాఖ్యానించారు. ఇక ఈ మాటలు వినగానే అందరికీ అనుమానాలు మొదలయ్యాయి. పేమెంట్ బాకీ పెట్టిన వారు ఎవరు? ఆయన మాటలు పరోక్షంగా మైత్రి మూవీ మేకర్స్ గురించా.. అనే చర్చ మొదలైంది. ఎందుకంటే 'పుష్ప 2' సమయంలో దేవిశ్రీ,మైత్రి మధ్య కొంత దూరం ఏర్పడినట్లు టాక్ వినిపించింది.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.